PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 180 | విజయవాడ, ఆదివారం 4 ఫిబ్రవరి 2024 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 4 February 2024 | Rs

నెలరోజుల్లోనే మారిన అంకెలు

- వృద్ధి లెక్కలు తారుమారు
- ప్రణాళిక శాఖ మరో నివేదిక

3



ఇంగ్లండ్‌ను కూల్చిన బుమ్రా

టీమిండియాకు 143పరుగుల ఆధిక్యత

6



'సిద్ధం' సభకు హాజరైన వైసిపి కార్యకర్తలు, ప్రజలు (ఇన్‌సెట్‌లో) ముఖ్యమంత్రి జగన్

నేను 124 సార్లు బటన్ నొక్కాను..

మీరు 2 బటన్లు నొక్కండి

- ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై వివరించండి
- ఏలూరు 'సిద్ధం' సభలో సిఎం జగన్

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

'గత 57 నెలల పాలనా కాలంలో 124 సార్లు బటన్ నొక్కి మీ ఖాతాల్లో రూ.2.55 లక్షల కోట్లు ఈ ప్రభుత్వం వేసింది. మీరు ఎంఎల్‌ఎ అభ్యర్థికి, ఎంపి అభ్యర్థికి రెండు బటన్‌లు నొక్కి మీ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించండి' అని వైసిపి అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. జగన్‌కు ఓటువేయకుండా, ప్రతిపక్షాలకు ఓటేస్తే పథకాల రద్దుకు ఆమోదం తెలిపినట్లేనని, మంచి జరగాలంటే జగన్‌ను మరిచిపోకూడదని పేర్కొన్నారు. పథకాలతో లబ్ధి పొందిన వారంతా స్టార్ క్యాంపెయినర్లుగా మారాలన్నారు. 2024 ఎన్నికల సన్నాహకాల్లో భాగంగా ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలకు సంబంధించిన వైసిపి ఆధ్వర్యాన 'సిద్ధం' సభ ఏలూరు జిల్లా దెందులూరులో శనివారం జరిగింది. ఈ సభలో జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పేదల భవిష్యత్తును కాటేసే కరోనా లాంటి దుష్ట చతుష్టయంపై సంగ్రామానికి అక్క చెల్లెమ్మలు, అవ్వ, తాతలు, సోదరులు, స్నేహితులు అంతా సిద్ధంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో పరిస్థితి చూస్తే జగన్ ఒంటిరివాడిలా కనిపిస్తాడని, అయితే, తాను ఏనాడూ ఒంటరి కాదని, కోట్ల మంది ప్రజలు గుండెల్లో తనను పెట్టుకున్నారని పేర్కొన్నారు. మేనిఫెస్టోలో 99 శాతం అమలు చేసినట్లు తెలిపారు. ప్రతిపక్ష నాయకులు తప్పుడు ప్రచారాలతో పేదల భవిష్యత్తుపై దాడి చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలోని 175 ఎంఎల్‌ఎ, 25 ఎంపి స్థానాలూ గెలవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం చేసిన మంచిని ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని సూచించారు. 14 ఏళ్లు సిఎంగా చేసిన చంద్రబాబు మీ ఇంటికి, ఊరికి, మీ సామాజిక తరగతికి ఏం చేశారో అడగాలన్నారు. పదేళ్లలో మీ బ్యాంకు ఖాతాలు చూసుకోవాలని, గడిచిన ఐదేళ్లలో మీ బ్యాంకు ఖాతాల్లో జమైన సొమ్ము చూడాలని కోరారు.

మళ్లీ పెట్టెలో పెట్టి బంధిస్తే చంద్రగ్రహణాలు ఉండవు

గత ఎన్నికల్లో పెట్టెలో పెట్టి బంధించిన చంద్రముఖిల బెడద శాశ్వతంగా వదిలించుకోవాలని జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. చంద్రముఖి సైకిల్ ఎక్కి, టీ గ్లాస్ పట్టుకుని పేదల రక్తం తాగేందుకు లకలక అంటూ అబద్ధాలు, మోసాలతో మీ తలుపు తట్టి ఇంట్లోకి వస్తుందని విమర్శించారు. పొత్తులు లేకపోతే 175 సీట్లలో వీరికి అభ్యర్థులు లేరని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మూడు జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. లక్షల సంఖ్యలో సభకు వస్తారని ఆశించినప్పటికీ జనం అంతగా రాక గ్యాలరీలు ఖాళీగా ఉండడం చర్చనీయాంశమైంది.

ఎరువుల అమ్మకానికి విఎఎలు

ఈ ఏడాది ఆర్‌బికెల ద్వారా 10.5 లక్షల టన్నుల టార్గెట్

- గ్రామ స్థాయిలో అధికారపార్టీ జోక్యం
- వ్యవసాయ సహాయకులపై తీవ్ర ఒత్తిడి
- రైతులకు సలహాలు గాలికి



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి


రైతుల చెంతకే సేవలంటూ ప్రభుత్వం వినూత్నంగా నెలకొల్పిన రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బికె) సిబ్బందిని విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల సేల్స్ సిబ్బందిగా మార్చేసింది. లక్ష్యాలు విధించి మరీ ప్రైవేటు సంస్థల ఉత్పత్తులు అమ్మాలని లక్ష్యాలు విధిస్తోంది. రైతుల ఆదరణ లేకపోయినా సరుకు అమ్మాల్సిందేనని హుకుం జారీ చేసింది. ప్రభుత్వ ఒత్తిళ్లకు సిబ్బంది తాళలేకపోతున్నారు. ఈ క్రమంలోనే రెండ్రోజుల క్రితం బాపట్ల జిల్లాలో పూజిత అనే విలేజి అగ్రికల్చర్ అసిస్టెంట్ (విఎఎ) ఆత్మహత్య చేసుకుంది. ఇంకా రెండు చోట్ల మరో ఇద్దరు విఎఎలు బలవన్మరణానికి ప్రయత్నించారు. ప్రైవేటు డీలర్ల, దుకాణదారుల బ్లాక్ మార్కెట్‌ను, అక్రమాలను అరికట్టేందుకే ఆర్‌బికెలలో వ్యవసాయ ఉత్పాదకాల అమ్మకాలని ప్రభుత్వం సమర్థించుకుంటున్నప్పటికీ, రైతులకు సాగులో మెలకువలు, అధునాతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన, శిక్షణ, సలహాలు ఇవ్వాల్సిన గ్రామ స్థాయి సిబ్బందిని ఆర్‌బికె దుకాణాలు నడిపేవారిగా తయారు చేసిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

10.50 లక్షల టన్నులు

2023-24 ఆర్థిక సంవత్సరంలో ఖరీఫ్, రబీ కలుపుకొని రాష్ట్ర రైతులకు 38 లక్షల టన్నుల ఎరువులు అవసరమవుతాయని అంచనా వేసి ఆ మేరకు కేంద్రం నుంచి కేటాయింపులు చేయించారు. వాటిలో 10.50 లక్షల టన్నులను ఆర్‌బికెలలో రైతులకు అమ్మించాలని లక్ష్యాలు రూపొందించారు. సీజన్ వారీగా, నెల వారీగా ఎంతెంత సేల్ చేయాలో టార్గెట్లిచ్చారు. క్రమానుగతంగా వ్యవసాయ స్పెషల్ కమిషనర్ నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌ల్లో తప్పకుండా ఎరువుల సేల్స్ ఎజెండా ఉంటుంది. జిల్లా అగ్రికల్చర్ అధికారులకు (డిఎ) సేల్స్‌పై సూచనలు చేస్తున్నారు. ఎడిలు, ఎంఎఒలు తమ పరిధిలోని ఆర్‌బికెలలో పని చేసే విఎఎలను సేల్స్‌పై కదిలించాలని ఇండెంట్లు పెట్టించాలని ఒత్తిడి చేస్తున్నారు. రైతుల నుంచి ఆదరణ లేకపోవడంతో ఈ ఏడాది టార్గెట్‌ను 8.77 లక్షల టన్నులకు తగ్గించారు. కాగా జనవరి నెలాఖరు నాటికి ఆర్‌బికెల నుంచి 4.32 లక్షల టన్నులకే ఇండెంట్లు వచ్చాయి. ఇండెంట్ పెట్టిన దాంట్లో 4.22 లక్షల టన్నులను మార్క్‌ఫెడ్ నుంచి సరఫరా చేయగా 3.71 లక్షల టన్నులను సేల్ చేశారు.

7 కోట్ల బకాయిలు

రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌బికెల నుంచి మార్క్‌ఫెడ్‌కు మూడు నెలలు దాటిన బకాయిలు రూ.7 కోట్ల వరకు ఉన్నాయని గురువారం స్పెషల్ కమిషనర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తేల్చారు. ఈ మొత్తాన్ని 15 రోజుల్లో సంబంధిత విఎఎల నుంచి వసూలు చేసి మార్క్‌ఫెడ్‌కు కట్టాలని, బకాయి ఉన్న విఎఎలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని, సరైన వివరణ ఇవ్వకపోతే కఠిన చర్యలు తీసుకోవాలని డిఎలను, ఎడిఎలకు, ఎంఎఒలను మిగతా 2లో



అద్వానీకి భారతరత్న

ప్రధాని అభినందనలు

ప్రజాశక్తి - యంత్రాంగం : బిజెపి అగ్రనేత ఎల్‌కె అద్వానీకి ప్రతిష్టాత్మక భారతరత్న అవార్డును కేంద్రప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ ఒక ప్రకటనలో తెలిపింది. ఎక్స్ వేదికగా ప్రధాని నరేంద్రమోడీ శనివారం "అద్వానీకి భారతరత్న దక్కడం సంతోషంగా ఉంది. ఆయనతో మాట్లాడి నేనూ అభినందనలు తెలిపాను. మన కాలంలో అత్యంత రాజనీతిజ్ఞుల్లో ఆయన ఒకరు. అట్టడుగు స్థాయి నుంచి ఉప ప్రధాని వరకు దేశాభివృద్ధిలో ఆయన పాత్ర కీలకం" అని పేర్కొన్నారు.

బాబ్రీ మసీదు స్థలంలో రాముడి ఆలయాన్ని నిర్మించాలంటూ అద్వానీ రథయాత్ర నిర్వహించారు. రథయాత్ర దేశవ్యాప్తంగా మత సమీకరణలకు, ఉద్రిక్తతలకు దారితీసింది. సుమారు రెండు వేల మంది ప్రాణాలు కోల్పోయారు. బాబ్రీ మసీదు కూల్చివేతకు దారితీసింది.

1927 నవంబర్ 8న ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉన్న కరాచీలో లాల్ కృష్ణ అద్వానీ జన్మించారు. 14 ఏళ్లకే ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరిన మిగతా 2లో

లడక్‌కు రాష్ట్ర హోదా

- ఆరో షెడ్యూల్‌లో చేర్చండి
- లేహ్, కార్గిల్ జిల్లాల్లో బంద్
- వేలాదిమందితో భారీ ప్రదర్శనలు

5

మినీ కాదు...మెగా డిఎస్‌సి కావాలి

- డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో అనంతపురం కలెక్టరేట్ ముట్టడి
- ఉద్రిక్తత...పలువురి అరెస్ట్



డిఎస్‌సి అభ్యర్థులు, డివైఎఫ్‌ఐ నాయకులను బలవంతంగా అరెస్టు చేస్తున్న పోలీసులు

3

శివసేన నేతపై కాల్పులు...

- బిజెపి ఎమ్మెల్యే అరెస్ట్
- పోలీస్ స్టేషన్‌లోనే ఘటన

అసోం సిఎం నిర్వాకం !

- ఖజానా ఖర్చుతో పార్టీ ప్రచారం
- హెలికాప్టర్లు, విమానాల్లో విహారం
- వివాహాలకూ సర్కారు సొమ్ముతోనే ప్రయాణం

రైతు వ్యతిరేక బడ్జెట్

- ప్రతులను దగ్ధం చేసి నిరసన



అభివాదం చేస్తున్న హేమంత్ సోరేన్

బల పరీక్షలో పాల్గొనవచ్చు

హేమంత్ సోరేన్‌కు ప్రత్యేక కోర్టు అనుమతి

రాంచి : జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్ ఈ నెల 5న అసెంబ్లీలో జరిగే బల పరీక్షలో పాల్గొనేందుకు రాంచిలోని ప్రత్యేక కోర్టు అనుమతించింది. మనీ లాండరింగ్ కేసులో జనవరి 31న ఇడి సోరేన్‌ను అరెస్టు చేసింది. శుక్రవారం ఐదు రోజుల పాటు ఇడి కస్టడీకి పంపింది. ఈ నేపథ్యంలో విశ్వాస పరీక్షలో పాల్గొనేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ప్రత్యేక పిఎంఎల్‌ఎ కోర్టులో సోరేన్ పిటిషన్ దాఖలు చేశారు. తాను అసెంబ్లీ సభ్యుడినని, ప్రత్యేక సమావేశంలో పాల్గొనేందుకు తనకు హక్కు వుందని ఆయన ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు.

ఇడి అభ్యంతరం తెలపడంలో అర్థం లేదు : అడ్వకేట్ జనరల్

అడ్వకేట్ జనరల్ రాజీవ్ రంజన్ మీడియాతో మాట్లాడుతూ హేమంత్ సోరేన్ పిటిషన్‌కు ఇడి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిందన్నారు. కొత్త ప్రభుత్వ ఏర్పాటును అడ్డుకోవడమే ఇడి ఉద్దేశంగా వుందని ఆయన పేర్కొన్నారు. దర్యాప్తు విషయంలో ఆయన జోక్యం చేసుకోనప్పుడు అసెంబ్లీ కార్యకలాపాలకు అభ్యంతరం తెలియజేయడంలో అర్థం లేదన్నారు. అందువల్లే కోర్టు తమ పిటిషన్‌ను ఆమోదించి, అనుమతి మంజూరు చేసిందని చెప్పారు.

'ఐఎన్‌ఎస్ సంధాయక్' జాతికి అంకితం

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)



ఐఎన్‌ఎస్ సంధాయక్ నౌకను జాతికి అంకితమిస్తున్న రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

సర్వే నౌక ఐఎన్‌ఎస్ సంధాయక్‌ను కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్ శనివారం జాతికి అంకితం చేశారు. తూర్పు నావికాదళానికి చెందిన మొదటి సర్వే వెసెల్ లార్జ్ (ఎస్‌విఎల్) నౌకగా పేరుగాంచిన సంధాయక్‌ను జాతికి అంకితమిచ్చే కార్యక్రమం విశాఖ నేవల్ డాక్ యార్డులో వేడుకగా సాగింది. ఓడరేవులు, నౌకాశ్రయాలు, నావిగేషనల్ ఛానల్స్, తీరప్రాంతాలు, లోతైన సముద్రాలపై ఈ నౌక పూర్తి స్థాయి హైడ్రోగ్రాఫిక్ సర్వేలు నిర్వహించి సురక్షితమైన సముద్ర నావిగేషన్‌కు వీలు కల్పించనుంది. ప్రారంభ కార్యక్రమంలో మంత్రి రాజనాథ్‌సింగ్ మాట్లాడుతూ ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సూపర్ పవర్‌గా ఉన్న భారత్‌ను ఐఎన్‌ఎస్ సంధాయక్ మరింత బలోపేతం చేయనుందన్నారు. సముద్రం, దాని ఆవరణ శాస్త్రం, వృక్ష, జంతు జాలాల గురించి మనం ఎంత ఎక్కువ సమాచారాన్ని సేకరిస్తే మన లక్ష్యాలను సాధించడం అంత సులభమవుతుందని తెలిపారు. చీఫ్ ఆఫ్ నేవల్ స్టాఫ్ అడ్మిరల్ ఆర్.హరి కుమార్ మాట్లాడుతూ నేవీ దేశీయంగా అత్యాధునిక నౌకలను ప్రారంభిస్తోందని తెలిపారు. ఈ క్రమంలోనే శక్తివంతమైన విమాన వాహక నౌక విక్రాంత్, డిస్ట్రాయర్లు, బహుముఖమైన నీలగిరి క్లాస్ ఫ్రిగేట్‌లు, అధునాతన జలాంతర్గాములను రూపొందిస్తున్నట్టు వెల్లడించారు. 66 షిప్‌లను, 64 సబ్‌మెరైన్‌లను భారతీయ షిప్‌యార్డ్‌ల్లో నిర్మిస్తున్నట్లు తెలిపారు.


ఆఫీస్‌కు వస్తేనే వేతన పెంపు

- టిసిఎస్ మెలిక

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద ఐటి కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) ఉద్యోగుల వేతన పెంపు, పదోన్నతులకు మెలిక పెట్టింది. కార్యాలయాలకు వచ్చి పని చేసే వారికే ప్రోత్సాహకాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. రిటర్న్ టు ఆఫీస్ నిబంధనలకు అనుగుణంగా జీతాల పెంపు, ప్రోత్సాహకాలు ఉంటాయని తమ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని అన్ని శాఖల హెడ్స్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఆఫీసుల నుంచి పని చేస్తున్న వారి పనితీరు, ఉద్యోగులకు ఇచ్చే గ్రేడ్ల ఆధారంగా ప్రోత్సాహకాలను అమలు చేయాలని ఆదేశించింది. అదే విధంగా కొత్త ఉద్యోగులు వారికి కేటాయించిన కోర్సులను విజయవంతంగా పూర్తి చేసిన వారికే ఏడాదికి రూ.3 లక్షల కంటే ఎక్కు వేతనాలకు అర్హులను పేర్కొంది. గతేడాది అక్టోబర్‌లోనే ఇంటి నుంచి పని విధానానికి టిసిఎస్ ముగింపు పలికినప్పటికీ.. కొందరూ ఇప్పటికీ హైబ్రిడ్ విధానంలో పని చేస్తున్నారు.

తహశీల్దార్ దారుణ హత్య

- భూవివాదాలే కారణం!
- వైసిపి పై ఆరోపణలు



రమణయ్య

ప్రజాశక్తి- మధురవాడ, ఎంవిపి కాలనీ (విశాఖ)

విశాఖ నగరంలో తన ఇంటి వద్ద తహశీల్దార్ దారుణ హత్యకు గురయ్యారు. రియల్ ఎస్టేట్, భూ వివాదాలే ఈ ఘటనకు కారణం కావడంతో రెవెన్యూ ఉద్యోగులు ఉలిక్కిపడ్డారు. పిఎం.పాలెం పోలీసుల కథనం ప్రకారం... జివిఎంసి ఐదో వార్డు పరిధి కొమ్మాదిలోని ఎస్‌టిబిఎల్ థియేటర్ వెనుక చరణ్ క్యాస్టల్స్ అపార్టుమెంట్ ఐదో అంతస్తులో తహశీల్దార్ సనపల రమణయ్య నివాసం ఉంటున్నారు. శుక్రవారం రాత్రి 10.15 గంటల సమయంలో ఫోన్ రావడంతో ఫ్లాట్ నుంచి ఆయన కిందకు వచ్చారు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తితో ఘర్షణ తలెత్తింది. సదరు వ్యక్తి తన వెంట తెచ్చుకున్న ఇనుప రాడ్డుతో రమణయ్య తలపై బలంగా కొట్టడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. రక్తపు మడుగులో పడి ఉన్న రమణయ్యను స్థానికులు ఆరిలోవలోని అపోలో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శని వారం తెల్లవారు జామున మృతి చెందారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అపార్టుమెంట్ సెల్లార్‌లోని సిసి ఫుటేజీలను పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. ఈ సంఘటనలో వైసిపి ప్రమేయంపై ఆరోపణలు వస్తున్నాయి. టిడిపి పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ వైసిపికి చెందిన వ్యక్తిగా అనుమానిస్తున్నట్లు తెలిపారు. విశాఖలో రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని ఆయన అన్నారు. మాజీ ఎంఎల్‌ఎ గండి బాబ్జీ మాట్లాడుతూ విశాఖలో జరుగుతున్న భూ వివాదాలు, హత్యల వెనుక ప్రభుత్వ పెద్దలున్నారని ఆరోపించారు.

బదిలీ తరువాత తొలి రోజు విధులకు ...

రమణయ్య సొంత ఊరు శ్రీకాకుళం జిల్లా నందిగామ మండలం దిమ్మిలాడ గ్రామం. ఆయనకు భార్య, పాప, బాబు ఉన్నారు. పదేళ్ల క్రితం విధుల్లో చేరిన ఆయన ఉత్తరాంధ్రలోని వజ్రపుకొత్తూరు, పద్మనాభం, విశాఖ రూరల్ (చినగదిలి) మండలాల్లో తహశీల్దార్‌గా పనిచేశారు. రెండు రోజుల క్రితం విజయనగరం జిల్లా బొండపల్లికి బదిలీ అయ్యారు. తొలిరోజు విధులకు హాజరై రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఇంటికి చేరుకున్న ఆయనపై దాడి జరిగింది.

త్వరలో అరెస్టు చేస్తాం : విశాఖ పోలీసు కమిషనర్ రవిశంకర్

రమణయ్యను హత్య చేసిన వ్యక్తిని గుర్తించామని విశాఖ సిటీ పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ తెలిపారు. హంతకుడిని త్వరలోనే అరెస్ట్ చేస్తామన్నారు. శనివారం మధ్యాహ్నం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రియల్ ఎస్టేట్, భూ వివాదాలే హత్యకు కారణం తెలిపారు. హత్య చేసిన వ్యక్తి విమానం ఎక్కి వెళ్లినట్టు గుర్తించామని చెప్పారు. ఆయన కోసం పది బృందాలతో గాలిస్తున్నామని తెలిపారు. ఆగంతకుడు గతంలో పలుమార్లు చినగదిలి తహశీల్దార్ కార్యాయాలానికి వచ్చి వెళ్లినట్లు గుర్తించామని చెప్పారు.

సమగ్ర విచారణ జరపాలి : సిపిఎం

తహశీల్దార్ రమణయ్య దారుణ హత్యపై సమగ్ర విచారణ జరిపి, నిందితులను కఠినంగా శిక్షించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శనివారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు.

కలెక్టరేట్ వద్ద రెవెన్యూ ఉద్యోగుల నిరసన

రమణయ్య కుటుంబీకులను ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు మిగతా 2లో

రైతు వ్యతిరేక బడ్జెట్

●ప్రతులను దగ్ధం చేసి నిరసన

ప్రజాశక్తి- యంత్రాంగం

కేంద్ర బడ్జెట్‌లో రైతులకు, వ్యవసాయ కార్మికులకు తీరని అన్యాయం జరగడం పట్ల సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు బడ్జెట్ ప్రతులను శనివారం దగ్ధం చేసి నిరసన తెలిపారు. రైతు సంఘాలు, సిఐటియు ఆధ్వర్యాన ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ బడ్జెట్ కార్పొరేట్లకు, పెట్టుబడిదారులకు ప్రయోజనం చేకూర్చేలా ఉందని వక్తలు విమర్శించారు. అనంతపురం జిల్లా కేంద్రంలో టవర్ క్లాక్ వద్ద కేంద్ర బడ్జెట్ ప్రతులను దగ్ధం చేశారు. ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి, ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాలరంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు ముష్కిన్, ఎం.పోతలయ్య తదితరులు పాల్గొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రైతులకు, కార్మికులకు, సామాన్య ప్రజలకు తీరని అన్యాయం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపి బడ్జెట్ ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్పొరేట్లకు దోచిపెట్టేలా ఈ బడ్జెట్ ఉందని విమర్శించారు. పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడలో బడ్జెట్ ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు ఉపేంద్ర మాట్లాడారు. ఏలూరులో జ్యూట్‌మిల్లు సెంటర్‌లోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద కేంద్ర బడ్జెట్ ప్రతులను దగ్ధం చేశారు. కార్పొరేట్లకు రాయితీలు- ప్రజలపై భారాల బడ్జెట్ అంటూ నినదించారు. పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం మండలం నవుడూరు జంక్షన్‌లో నిరసన తెలిపారు. తాడిపత్రిలో కేంద్ర బడ్జెట్ ప్రతులను దగ్ధం చేశారు. నంద్యాల జిల్లా బండిఆత్మకూరు మండలంలో నిరసన తెలిపారు.



ఏలూరులో బడ్జెట్ ప్రతులు దగ్ధం చేస్తున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు

5,6 తేదీల్లో చంద్రబాబు 'రా కదలిరా' సభలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు 'రా కదలిరా' సభలు ఈ నెల 5,6 తేదీల్లో జరగనున్నాయి. 5వ తేదీ అనకాపల్లి పార్లమెంట్ మాడుగుల, ఏలూరు పార్లమెంట్ చింతలపూడిలో ఈ సభలను నిర్వహించనున్నారు. 6వ తేదీన చిత్తూరు పార్లమెంట్‌లోని జిడి నెల్లూరు సభలో చంద్రబాబు పాల్గొంటారు. మొత్తం 25 పార్లమెంట్ నియోజక వర్గాల్లో ఈ సభలు నిర్వహించాలని టిడిపి నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు 17 నియోజకవర్గాల్లో సభలు పూర్తయ్యాయి.

బిఆర్ఎస్‌కు రాజయ్య రాజీనామా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య బిఆర్ఎస్‌ను వీడారు. ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు బిఆర్ఎస్ అధ్యక్షుడు కెసిఆర్‌కు రాసిన లేఖను శనివారం ఆయన మీడియాకు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బిఆర్ఎస్‌లో మానసిక క్షోభకు గురయ్యానని చెప్పారు. పార్టీలో తనకు సరైన గుర్తింపు లభించడంలేదని తెలిపారు. పార్టీ అధినాయకత్వాన్ని కలిసే అవకాశమే దక్కడంలేదని వాపోయారు. కార్యకర్తల నుంచి తీవ్రస్థాయిలో ఒత్తిడి ఉందని, వారితో చర్చించి భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటానని వెల్లడించారు. బిఆర్ఎస్ పార్టీ విధివిధానాలు తనకు నచ్చడంలేదని, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని కూలుస్తామనడం సరికాదన్నారు. తాను 15 ఏళ్ల కాంగ్రెస్‌లో ఉండే తెలంగాణ కోసం పోరాడానని రాజయ్య తెలిపారు.

యువ కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-పెరవలి

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం ఖండవల్లిలో శనివారం చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తుమ్మూరి వెంకటేశ్వర్లు (35) సుమారు ఎనిమిది ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ ఏడాది కూరగాయలు, వరిపంట సాగు చేశారు. తుపాను కారణంగా పంట మొత్తం నాశనమైంది. సాగు నిమిత్తం చేసిన అప్పులకు వడ్డీ భారం అధికమవ్వడంతో పొలంలోనే పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

ఐబి కార్యాలయం ప్రారంభం

అమరావతి బ్యూరో:ఇంటర్నేషనల్ బాలకలారియేట్ (ఐబి) కార్యాలయం రాష్ట్రంలో ప్రారంభమైంది. విజయవాడలోని ఆటోనగర్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిశోధన శిక్షణ విద్యామండలి (ఎపిఎస్ఈఆర్‌టి) కార్యాలయంలో పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ శనివారం ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఐబి కోర్సులు అందించేందుకు అవసరమైన కార్యాచరణ వెంటనే ప్రారంభించినట్లు ప్రవీణ్ ప్రకాష్ ఈ సందర్భంగా అన్నారు. ఐబి కరికులం, అసెస్‌మెంట్, ప్లానింగ్, ట్రైనింగ్ వంటి కార్యక్రమాలను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్ సురేష్‌కుమార్, ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి సౌరభ్ గౌర్, సమగ్ర శిక్ష అభియాన్ డైరెక్టర్ బి శ్రీనివాసరావు, మధ్యాహ్నం భోజన పథకం డైరెక్టర్ శోభిక, ఐబి బృందం సభ్యులు మహేష్ బాలకృష్ణన్, ఆంటోనీ బెగన్, మార్క్‌నీసం ప్రారంభించారు.

వికసిత్ భారత్ ద్వారా కేంద్ర పథకాలు ప్రచారం

● **అజయ్‌జైన్**

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వికసిత్ భారత్ సంకల్పయాత్ర ద్వారా కేంద్ర పథకాల గురించి గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత ప్రచారం కల్పించినట్లు వికసిత్ భారత్ సంకల్పయాత్ర స్టేట్ నోడల్ ఆఫీసరు అజయ్‌జైన్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతేడాది నవంబరు 25న ప్రారంభించిన సంకల్పయాత్ర 26 జిల్లాల్లో నిర్వహించడంజరిగిందని పేర్కొన్నారు. డిసెంబరు 7 నుంచి అర్బన్ ప్రాంతాల్లో యాత్ర ప్రారంభించామని తెలిపారు. రెండో విడతలో 11 మునిసిపాలిటీలను కవర్ చేయడం జరుగుతుందని అందులో విశాఖపట్టణం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, రాజమండ్రి, కర్నూలు, కాకినాడ, ప్రకాశం, శ్రీకాకుళం, అనంతపురం, చిత్తూరుల్లో ఈనెల 5నుంచి 25వరకు సంకల్పయాత్రలు నిర్వహించడంజరుగుతుందని తెలిపారు.

7 నుండి మెడికల్స్ రిప్స్ జనరల్ కౌన్సిల్

● **9న రాష్ట్ర సమావేశాలు**

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎంఆర్ఏఐ) జనరల్ కౌన్సిల్ సమావేశాలు ఈ నెల 7వ తేదీ నుండి 9వ తేదీ వరకూ విజయవాడ జగనున్నాయి. శనివారం ఎంబివికెలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యు.వి.కృష్ణయ్య, అధ్యక్షులు కుమార్ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా జనరల్ కౌన్సిల్ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైట్ టు హెల్త్ అనే నినాదంతో ఈ సమావేశాలు జరుగుతున్నాయని తెలిపారు. దేశ వ్యాప్తంగా 22 రాష్ట్రాల నుండి 400 మంది ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఏడోతేదీ ఉదయం పదిగంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశాలకు ఎఫ్ఎంఆర్ఏఐ వ్యవస్థాపకులు జె.ఎస్.మజుందార్, సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్, ఎఫ్ఎంఆర్ఏఐ అధ్యక్షులు రమేష్ సుందర్, ప్రధాన కార్యదర్శి శాంతను చటర్జీ పాల్గొని మాట్లాడుతారని తెలిపారు. అలాగే రాష్ట్ర సమావేశాలు తొమ్మిదోతేదీ జరుగుతాయని, ఈ సమావేశాల్లో ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, ఆహ్వాన సం:ఘ ఛైర్మన్ డాక్టర్ పి.వి.రమణమూర్తి, చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ కె.వి.జి.రెడ్డి, ప్యాట్రన్ డాక్టర్ ఎం.కిరణ్ తదితరులు పాల్గొంటారని వివరించారు.

కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు వర్తింపచేయాలి

● **ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం**


ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కౌలు రైతులను గుర్తించి ప్రభుత్వ పథకాలు వర్తింపచేస్తామని కేంద్రప్రభుత్వం తన బడ్జెట్‌లో చెప్పకపోవడం దుర్మార్గమని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం విమర్శించింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో కౌలు రైతులు, కౌలు వ్యవసాయం వేగంగా పెరుగుతుందని తెలిపారు. కౌలు రైతులను గుర్తించి ప్రభుత్వ పథకాలన్నీ వాస్తవ సాగుదారులైన వారికే ఇవ్వాలనే కోరికను దేశంలో కౌలు రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు వ్యక్తం చేస్తున్నారని వివరించారు. కనీసం ఎన్నికల వేళ అయినా కేంద్రప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంటుందనే కౌలు రైతుల ఆశలపై బడ్జెట్ నీళ్లు చల్లిందని పేర్కొన్నారు. ఒక వైపు వ్యవసాయ ఉత్పత్తుల ధరలు విపరీతంగా పెరిగాయని, మరోవైపు ప్రధానమంత్రి సమ్మాన్ నిధికి కేటాయింపులు కూడా పెంచలేదని పేర్కొన్నారు. పంటలకు కనీస మద్దతు ధరలు, రైతు రుణమాఫీపై బడ్జెట్‌లో ఏమి చెప్పలేదని తెలిపారు. పంటల అనంతరం దిగుబడి నిల్వ చేయడం, సరఫరా మార్గాలు, వివిధ స్థాయిలలో ప్రాసెసింగ్, మార్కెటింగ్‌లలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని పెంచి పోషించేందుకు హామీ ఇవ్వటం అంటే కార్పొరేట్ శక్తులకు వ్యవసాయాన్ని కట్టబెట్టడమేనని విమర్శించారు. వ్యవసాయ రంగానికి రూ.81వేల కోట్లు, ఆహార సబ్సిడీలో 60,740 కోట్లు, ఎరువుల సబ్సిడీలో రూ.62,445కోట్ల కేటాయింపులను తగ్గించారని తెలిపారు. రానున్న కాలంలో ఆహార భద్రత ప్రమాదంలో పడబోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎరువుల ధరలు పెరుగడంతో వ్యవసాయం నుంచి రైతాంగం ప్రతి రోజూ ఇతర వృత్తులకు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి పోతున్నారని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక దాదాపు లక్షమందికి పైగా రైతులు, కౌలు రైతులు ఆత్మహత్యచేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వలసలను, ఆత్మహత్యలను ఆపడానికి ఈ బడ్జెట్ ఏ విధమైన చర్యలు తీసుకోలేదని విమర్శించారు.

బిఎన్ఎస్ 2023 చట్టం రద్దుకు సంతకాల సేకరణ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) 2023 చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కర్నూలు జిల్లా మోటార్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో డ్రైవర్లతో సంతకాల సేకరణ చేపట్టారు. పెరిగిన చలానాలు, ట్రాఫిక్, అధికారుల వేధింపులు అరికట్టాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సంతకాల సేకరణను ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్, ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కోశాధికారి జె.దివాకర్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. అంజిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..బిఎన్ఎస్ 2023 చట్టంలోని సెక్షన్ 106 (1), 106 (2) కేంద్ర ప్రభుత్వం తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చట్టంలోని ప్రమాదకర శిక్షల కారణంగా డ్రైవర్లు తీవ్రమైన అశాంతికి ,ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. చట్టం అమలు చేస్తే డ్రైవర్లు రోడ్ల మీద కాకుండా జైల్లో ఉండాల్సి వస్తుందని పేర్కొన్నారు. ప్రమాదాల కారణాలను పరిశీలించకుండా ఏకపక్షంగా కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకొచ్చిందని విమర్శించారు. ఈ చట్టంతో డ్రైవర్ల కొరత మరింత పెరిగే అవకాశం ఉందని, దేశంలోని రహదారుల నిర్మాణ లోపాలను, అధ్వానమైన రోడ్ల స్థితిగతులను, వెహికల్ కండిషన్‌ను పరిగణలోకి తీసుకోకుండా ప్రమాదం జరిగితే డ్రైవర్లను దోషిగా చేసి శిక్షించడం దుర్మార్గమన్నారు. ఈ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16న రవాణా రంగాన్ని స్తంభింపజేయాలని కేంద్ర రవాణా రంగ అసోసియేషన్లు పిలుపునిచ్చాయని తెలిపారు. కర్నూలు జిల్లా మోటార్ వర్కర్స్ యూనియన్ నుంచి కె.గంగాధర్, వలి, ఆటో వర్కర్స్ యూనియన్ నుంచి వెంకటేష్, ఎస్‌డబ్ల్యుఎఫ్ నుంచి బి.నాగరాజు, స్కూల్ బస్ యూనియన్ నుంచి సిద్దయ్య, ఆటోమొబైల్ రంగం గ్యారేజీల నుంచి గోవిందు పాల్గొన్నారు.



బిఎన్ఎస్‌ను రద్దు చేయాలని సంతకాలు చేస్తున్న డ్రైవర్లు

సలహాదారుల జీతాల కోసం నిధులు మళ్లింపు

● **నాదెండ్ల మనోహర్ ఆరోపణ**

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి సలహాదారుల జీతాల కోసం వివిధ కార్పొరేషన్ల నిధులు మళ్లిస్తున్నారని జనసేన పిఎసి ఛైర్మన్ నాదెళ్ల మనోహర్ ఆరోపించారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సలహాదారులకు ఏ పద్దు కింద , ఏ ఖాతా కింద వాటిని చెల్లిస్తున్నారో ప్రభుత్వం బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర కేబినెట్ మంత్రి నెలవారి బేసిక్ రూ.14 వేలు కాగా, ముఖ్యమంత్రికి ప్రసంగం రాసే కమ్యూనికేషన్స్ సలహాదారునికి నెలవారీ వేతనం అక్షరాల రూ.2 లక్షలని ఆయన చెప్పారు. వీరికి చెల్లిస్తున్న వేతనం హైకోర్టు న్యాయమూర్తుల నెలవారీ వేతనంతో సమానమని పేర్కొన్నారు. ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరిస్తున్న సలహాదారునికి తాడేపల్లిలోని విలాసవంతమైన కార్యాలయం నిర్వహణకు స్కిల్ డెవలప్‌మెంట్, మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి నిధులు మళ్లిస్తున్న మాట వాస్తవం కాదా? అని నాదెండ్ల ప్రశ్నించారు.

రానున్న ఎన్నికల్లో వైసిపి ఆల్ ఔట్

● **అచ్చెన్నాయుడు**



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ఆల్‌ఔట్ కానుందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ప్రజావ్యతిరేక సునామీలో వైసిపి కొట్టుకుపోవడం ఖాయమనే భయం జగన్‌లో కొట్టొచ్చినట్లు కనపడుతోందని పేర్కొన్నారు. ప్రజాసంక్షేమాన్ని ధ్వంసం చేసిన జగన్‌కు ఓటనే ఆయుధంతో ప్రజలు రాజకీయ సమాధి కట్టడం ఖాయమని తెలిపారు. యుద్ధానికి ముందే ఓటమి ఒప్పుకున్న పిరికిపంద అని విమర్శించారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలను కలిసేందుకు కూడా ఇష్టపడని తను పెత్తందారుడు కాక మరేమిటని ప్రశ్నించారు. ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్‌తో యువత భవితను ప్రశ్నార్థకం చేయడమా అని ప్రశ్నించారు. తహశీల్దార్ రమణయ్య హత్య రాష్ట్రంలోని శాంతి భద్రతలకు అద్దం పడుతోందని మరో ప్రకటనలో విమర్శించారు.

ఉద్యోగుల ప్రాణాలు తీసే జగన్ ప్రభుత్వం: లోకేష్

వైసిపి నేతల అవినీతి, అక్రమాలు, వేధింపులతో ప్రభుత్వ ఉద్యోగులు ప్రాణాలు కోల్పోవడం విచారకరమని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు. ఆత్మహత్యలొద్దని, ఆత్మస్థైర్యంతో ఉండాలని శనివారం ఒక ప్రకటనలో కోరారు. వైసిపి అధికారంలోకి వచ్చిన నుంచి సాగిస్తున్న అవినీతి, అరాచక పాలనకు వందలాది మంది ప్రభుత్వ ఉద్యోగులు బలయ్యారని, ఇవన్నీ జగన్ సర్కార్ చేసిన హత్యలేనని విమర్శించారు.

వచ్చే ఎన్నికల్లో వైసిపికి అభ్యర్థులే దొరకరు : కన్నా

జగన్ దురహంకారంతో వచ్చే ఎన్నికల్లో వైసిపికి అభ్యర్థులే దొరకరని మాజీమంత్రి, టిడిపి సీనియర్ నాయకులు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ఒక్క అవకాశం అని ప్రజల్ని నమ్మించి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక బ్రిటీష్ వారి కంటే దారుణంగా రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నారని విమర్శించారు.

అవినీతిపై ఫిర్యాదు చేసి

సాక్ష్యం చెప్పకపోతే ప్రాసిక్యూట్ చేయాలి

● **హైకోర్టు కీలక తీర్పు**

ప్రజాశక్తి, అమరావతి

ప్రభుత్వ అధికారులపై అవినీతికి పాల్పడ్డారంటూ ఫిర్యాదు చేసి..ఆ తర్వాత సాక్ష్యం చెప్పేందుకు నిరాకరిస్తే అటువంటి వారిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలంటూ ఒక కేసులో రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఇటీవల తీర్పు వెలువరించింది. ఓ అధికారి లంచం తీసుకున్నారని ఫిర్యాదు చేసిన వ్యక్తే అబ్బే కాదంటూ కేసు విచారణ సమయంలో సాక్ష్యం చెప్పడాన్ని హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఆ వ్యక్తిపై ఐపిసి సెక్షన్లు 191, 193 కింద ప్రాసిక్యూట్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని విజయవాడ అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) కోర్టును ఆదేశించింది. ఆ వ్యక్తిపై విజయవాడ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని కూడా ఆదేశించింది. అవినీతి నిరోధక చట్టం (పిసి యాక్ట్)లోని సెక్షన్ 7, సెక్షన్ 13(1)(డి), 13(2) కింద ఎసిబి కోర్టు విధించిన శిక్షను సైతం సవరించింది. ఈ మేరకు జస్టిస్ అడుసుమల్లి వెంకట రవీంద్ర బాబు ఇటీవల తీర్పు చెప్పారు.

విజయవాడకు చెందిన ఎస్ చంద్రశేఖర్ 1997 నుంచి 2003 వరకు మచిలీపట్నం మున్సిపాల్టీలో సానిటరీ అండ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. అప్పుడు తన బియ్యం దుకాణానికి అధికారిక ఉపకారం చేసేందుకు ఆయన తనను రూ.5 వేలు లంచం అడిగారంటూ అదే ప్రాంతానికి చెందిన ఎం మురళీధర్ ఎసిబికి ఫిర్యాదు చేశారు. చంద్రశేఖర్‌ను ఇంట్లోనే అరెస్టు చేసిన ఎసిపి, పిసి యాక్ట్‌లోని సెక్షన్ 7, సెక్షన్ 13(1)(డి), 13(2) కింద కేసు నమోదు చేసింది. చంద్రశేఖర్‌పై చేసిన ఆరోపణలు తప్పని మురళీధర్ కోర్టులో సాక్ష్యం చెప్పారు. ఇతర సాక్షుల విచారణ తర్వాత ఎసిబి కోర్టు, చంద్రశేఖర్‌కు సెక్షన్ 7 కింద ఏడాది సాధారణ జైలు శిక్ష, రూ.1000 జరిమానా, సెక్షన్ 13 కింద ఏడాది జైలు, రూ.2వేల జరిమానా విధిస్తూ 2007లో తీర్పు చెప్పింది. దీనిని చంద్రశేఖర్ హైకోర్టులో సవాల్ చేశారు. ఫిర్యాదుదారు మురళీధర్‌పై పెర్జురీ కింద ఎసిబి కోర్టు తనకున్న విచక్షణాధికారాన్ని వినియోగించి ఈ విషయం గురించిఈ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్‌కు ఫిర్యాదు చేయాల్సివుందని హైకోర్టు పేర్కొంది. తప్పుడు సాక్ష్యం చెప్పిన మురళీధర్‌ను ప్రాసిక్యూషన్ ఎదుర్కోవాల్సిందేనని తీర్పులో పేర్కొంది. మూడు వారాల్లోగా చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్‌కు ఫిర్యాదు చేయాలని ఎసిబి ప్రత్యేక కోర్టును ఆదేశించింది. శానిటరీ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌కు పిసి యాక్ట్ సెక్షన్ 7 కింద ఏసీబీ కోర్టు విధించిన శిక్షను రద్దు చేసింది. సెక్షన్ 13(1)(డి), 13(2) కింద విధించిన శిక్షను ఖరారు చేసింది.

పోలీసుల కళ్లుగప్పి దొంగలు పరారీ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

కోర్టులో హాజరుపరిచేందుకు తీసుకెళ్తుండగా పోలీసుల కళ్లుగప్పి ఇద్దరు దొంగలు పరారైన సంఘటన ఏలూరులో శనివారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాల ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం సత్తుపల్లి మండలం రామాలయం వీధికి చెందిన నీలాల అనిల్‌కుమార్ (20), మంచిర్యాల మండలం మండమర్రి గ్రామానికి చెందిన భీమిలి రాజకుమార్ (20) వివిధ చోరీ కేసుల్లో నిందితులు. జైలులో వీరి మధ్య పరిచయం పెరిగి స్నేహితులయ్యారు. నాటి నుంచి ఇద్దరూ కలిసి తెలంగాణ నుండి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి పలు జిల్లాల్లో దొంగతనాలకు పాల్పడ్డారు. ప్రస్తుతం ఓ చోరీ కేసులో అరెస్టై మిర్యాలగూడ సబ్‌జైల్లో ఉన్నారు. ఏలూరు సిసిఎస్ పోలీస్ స్టేషన్ సిబ్బంది వారిని పిటి వారెంట్‌పై మన రాష్ట్రానికి తీసుకొచ్చారు. ఏలూరు సబ్‌జైల్లో వారిని అప్పగించగా, త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ఇంటిలో జరిగిన దొంగతనం కేసు విచారణ నిమిత్తం పోలీసులు వారిని స్టేషన్‌కు తరలించారు. విచారణ అనంతరం ఇద్దరు కానిస్టేబుళ్ల ఎస్కార్ట్‌తో కోర్టులో హాజరుపర్చేందుకు తీసుకెళ్లారు. కోర్టు సమీపంలోకి వెళ్లేసరికి పోలీసుల కళ్లుగప్పి పరారయ్యారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు పరారైన నిందితుల కోసం గాలింపు జరిపినా వారి ఆచూకీ లభించలేదు. సిఎం జగన్ సిద్ధం సభ నేపథ్యంలో పోలీసులంతా బందోబస్తు విధుల్లో ఉండడంతో గాలింపు కూడా నామమాత్రంగానే జరిగింది. దీనిపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్కార్ట్ కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ వేటు

ఈ ఘటనకు సంబంధించి ఎస్కార్ట్ కానిస్టేబుళ్లు హేమసుందర్, రాజేష్‌ను సస్పెండు చేస్తూ జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

11న దళిత సింహ గర్జన

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

వైసిపి ప్రభుత్వంలో దళితులు అణచివేతకు గురవుతున్నారని మాజీ ఎంపి హర్షకుమార్ తెలిపారు. ఈ నెల 11న నిర్వహించనున్న దళిత సింహ గర్జన కార్యక్రమం పోస్టర్‌ను తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హర్ష కుమార్ మాట్లాడుతూ.. దళిత ప్రభుత్వం అని ప్రచార ఆర్భాటం చేస్తున్న జగన్ సర్కారు ఎస్‌సిలకు చెందిన 16 పథకాలను రద్దు చేసిందన్నారు. ఈ ఐదేళ్లలో వందల సంఖ్యలో దళితులు హత్యలకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితుల కోసం ప్రత్యేకంగా ఒక్క పథకం కూడా ఏర్పాటు చేయలేదని విమర్శించారు. జగన్‌పై దాడి కేసులో దళితుడైన శ్రీనుకు బెయిలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కోర్టుకు వెళ్లేందుకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లుగా ఎందుకు తాత్సారం చేస్తున్నారని నిలదీశారు. వైసిపిని గద్దె దింపేందుకు దళితులంతా సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఏలూరులో వైసిపి నిర్వహించిన సిద్ధం సభకు వైసిపి కార్యకర్తలను తరలించేందుకు పాఠశాలలకు సెలవు ఇచ్చి బస్సులు తీసుకెళ్లారని తప్పుపట్టారు. దళిత సింహ గర్జనను జయప్రదం చేయాలని కోరారు.

బడ్జెట్‌లో దళిత, ఆదివాసీలకు మొండి చెయ్యి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర బడ్జెట్‌లో దళిత, ఆదివాసీలకు మోడీ ప్రభుత్వం మొండి చెయ్యి చూపిందని దళిత, బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇ. చిట్టిబాబు విమర్శించారు. విజయవాడ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. సామాజిక న్యాయం, సమానత్వమనేది నినాదంగానే మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో ఎక్కడా పేదరిక నిర్మూలనకు నిర్దిష్టమైన చర్యలు తీసుకున్నట్లు కనబడలేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టిల ఆర్థిక అభివృద్ధి కోసం సవరణలు తీసుకురావాలని కోరారు. మాన్యువల్ స్కావెంజింగ్ విధానాన్ని రద్దు చేసి వారి పునరావాసానికి నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎరువుల అమ్మకానికి విఎఎలు

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశించారు. ఎప్పుడైతే కమిషనర్ నుంచి ఇటువంటి ఆదేశాలు వెళ్లాయో విఎఎలు గజగజ ఒణికిపోతున్నారు. ఆ ప్రభావమే బాపట్లలో పూజిత ఆత్మహత్య. మరో ఇద్దరు విఎఎల ఆత్మహత్యాయత్నంగా తెలుస్తోంది. ఇదిలా ఉండగా మార్క్‌ఫెడ్ నుంచి ఆర్‌బికెలకు సరఫరా చేసిన ఎరువుల్లో 67 వేల టన్నుల నిల్వలకు లెక్కలు తేలట్లేదని సమాచారం. సంవత్సరం నుంచి ఈ పరిస్థితి ఉండటంతో దానిపైనా కమిషనరేట్ దృష్టి సారించింది. తక్షణం డిఎఒలు, కింది స్థాయి అధికారులు నిల్వలపై సమీక్షించాలని, ప్రత్యేక బృందాలను నెలకొల్పి ఆర్‌బికెలను సందర్శించాలన్నారు. ఈ ఒత్తిడి కూడా విఎఎలపై ఉంది. ఆర్‌బికెల అద్దె, వాటి నిర్వహణపై గ్రామ స్థాయిలో అధికారపార్టీ జోక్యం వ్యవసాయ సహాయకుల కొంప ముంచుతోంది. కొన్ని చోట్ల విఎఎలు, ఆపై అధికారులు అవినీతికి పాల్పడటం కూడా చిరుద్యోగుల మెడకు చుట్టుకుంటోందని తెలుస్తోంది.

అద్వానీకి భారతరత్న

(మొదటిపేజీ తరువాయి)

ఆయన పాక్‌లోని హైదరాబాద్ డిజి నేషనల్ కాలేజీలో న్యాయవిద్య పూర్తి చేశారు. 1977-80లో జనతా పార్టీ ప్రధాన కార్యదర్శిగానూ, 1977-79 మధ్య సమాచార, ప్రసార శాఖ మంత్రిగానూ పనిచేశారు. 1980లో వాజ్‌పేయితో కలిసి బిజెపిని స్థాపించారు. 1998 నుంచి 2002 వరకూ కేంద్ర హోం మంత్రిగానూ, 2002 నుంచి 2004 వరకూ ఉప ప్రధానిగానూ బాధ్యతలు నిర్వహించారు. 2004 నుంచి 2014 వరకూ ప్రతిపక్ష నేతగా కొనసాగారు. మూడుసార్లు రాజ్యసభ సభ్యుడిగానూ, మూడుసార్లు లోక్‌సభ సభ్యుడిగానూ ఎన్నికయ్యారు. 2019 నుంచి క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్నారు. 2015లో ఆయనకు కేంద్రం పద్మవిభూషణ్ అవార్డును ప్రదానం చేసింది. ఇప్పటివరకూ ఆర్‌ఎస్‌ఎస్ నుంచి వచ్చిన నలుగురికి దేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్నను మోడీ ప్రభుత్వం అందజేసింది. అద్వానీతోపాటు మాజీ ప్రధాని వాజ్‌పేయి, పండిట్ మదన్ మోహన్ మాలవ్య, నానాజీ దేశ్‌ముఖ్‌లకు భారతరత్న అవార్డులను ప్రదానం చేసింది.

నిస్వార్థంగా పనిచేశాను : అద్వానీ

అద్వానీకి పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అద్వానీ మాట్లాడుతూ.. 'నేను 14 ఏళ్ల వయసులోనే ఆర్‌ఎస్‌ఎస్‌లో వలంటీర్‌గా చేరాను. అప్పటినుంచి నాకప్పగించిన ఏ పనైనా అంకిత భావంతో చేశాను. దేశం కోసం నిస్వార్థంగా పనిచేశాను' అని అన్నారు.

గవర్నర్ తదితరుల హర్షం

అద్వానీకి భారత రత్న అవార్డు రావడం పట్ల గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. భారతరత్న అవార్డు అద్వానీకి రావడం హర్షణీయమని టిడిపి అధ్యక్షులు చంద్రబాబునాయుడు, రాష్ట్ర పార్టీ అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. దేశ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన అద్వానీకి భారతరత్న రావడం సంతోషమని బిజెపి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దగ్గుపాటి పురందేశ్వరి పేర్కొన్నారు. దేశ రాజకీయాల్లో తన కంటూ ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించుకున్న నాయకుడుగా అద్వానీని జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ అభినందించారు.

తహశీల్దార్ దారుణ హత్య

(మొదటిపేజీ తరువాయి)

సత్తి నాగేశ్వరరెడ్డి తదితరులు కెజిహెచ్ వద్ద పరామర్శించారు. ప్రభుత్వ భూములకు రక్షణగా ఉన్న ఉద్యోగులకు రక్షణ లేకుండా పోయిందని ఈ సందర్భంగా వారు మీడియాకు చెప్పారు. అనంతరం ఉద్యోగులంతా కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. రమణయ్య కుటుంబీకులను టిడిపి మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, జనసేన పార్టీ నాయకులు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ పరామర్శించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి : రెవెన్యూ అసోసియేషన్ల డిమాండ్

రమణయ్యను హత్య చేసిన నిందితులను తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని పలు రెవెన్యూ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు రాష్ట్ర డిప్యూటీ కలెక్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.విశ్వేశ్వరనాయుడు , ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఛైర్మన్, ప్రధాన కార్యదర్శులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, చేబ్రోలు కృష్ణమూర్తి, ఎపి గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు భూపతిరాజు రవీంద్రరాజు, ఎం అప్పలనాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. రమణయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, తహశీల్దార్లకు, విఆర్‌ఓలకు ప్రభుత్వం ప్రత్యేక రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల వైజాగ్‌లో భూ సంబంధించిన విషయాలపై విఆర్‌ఓలపై క్రిమినల్ కేసులు పెట్టడాన్ని ఖండించారు. విధి నిర్వహణలో ప్రభుత్వ ఉద్యోగిపై ఎవరు దాడి చేసినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రెవిన్యూ సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. తహశీల్దార్ హత్యకు నిరసనగా శనివారం 26 జిల్లాల్లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలిపినట్లు రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్ తెలిపింది.

ఇసెట్ కన్వీనర్‌గా భానుమూర్తి




ప్రజాశక్తి-అనంతపురం

ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఎపి ఇసెట్-2024) కన్వీనర్‌గా అనంతపురం జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ ఆచార్యులు పిఆర్.భానుమూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు జెఎన్‌టియు ఉపకులపతి జివిఆర్ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ సి.శశిధర్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. అనంతపురం జెఎన్‌టియు, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి సంయుక్త ఆధ్వర్యంలో ఇసెట్ పరీక్షను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కన్వీనర్ భానుమూర్తి మాట్లాడుతూ.. తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానన్నారు. అనంతరం భానుమూర్తికి రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, యూనివర్సిటీ డైరెక్టర్లు, కళాశాల ప్రిన్సిపల్ ఎస్.వి.సత్యనారాయణ, సిబ్బంది అభినందనలు తెలిపారు.

నెలరోజుల్లోనే మారిన అంకెలు

- వృద్ధి లెక్కలు తారుమారు
- ప్రణాళిక శాఖ మరో నివేదిక



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో వృద్ధి, జిఎస్‌డిపి వంటి కీలక అంశాలపై ప్రణాళిక శాఖ తీరు విస్మయపరుస్తోంది. నెల రోజుల క్రితం భారీ వృద్ధిని చూపించిన ఆ శాఖ తాజాగా దానికి భిన్నమైన నివేదికను రూపొందించింది. దీంతో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. ఉన్నతాధికారులు సైతం ఈ పరిణామం పట్ల విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వార్షిక బడ్జెట్ కోసం జనవరి మధ్య కాలంలో ప్రణాళిక శాఖ జిఎస్‌డిపి, జివిఏ, వ్యవసాయం, పారిశ్రామిక, సేవ రంగాల్లో వృద్ధిపై నివేదికలు సిద్ధం చేసింది. ఇందులో గణనీయంగా వృద్ధి నమోదైనట్లు చూపించింది. అది వివాదాస్పదం కావడంతో తాజాగా మరో నివేదికను సిద్ధం చేసింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అంశాలపై జనవరిలో వెల్లడించిన తొలి నివేదికలో అన్ని రంగాల్లోనూ మెరుగైన వృద్ధి నమోదైనట్లు ప్రకటించగా, ఫిబ్రవరిలో వెల్లడించిన నివేదికలో మూడు రంగాల్లో వృద్ధి తగ్గినట్లు పేర్కొన్నారు. చివరకు జిఎస్‌డిపి కూడా తగ్గినట్లు చూపించారు. తొలి నివేదికలో 13.17 లక్షల కోట్ల రూపాయలుగా జిఎస్‌డిపి ఉన్నట్లు పేర్కొనగా, దానిని తాజా నివేదికలో 13.03 లక్షల కోట్లకు తగ్గించి చూపించారు. అయితే కొత్త నివేదికలో 2023-24 జిఎస్‌డిపి కూడా అదనంగా పొందుపరుస్తూ 14,39,674 కోట్లు జిఎస్‌డిపి రికార్డయిందని వెల్లడించడం విశేషం. ఇదే సమయంలో గ్రాస్ వాల్యూ యాడెడ్ (జివిఏ) మాత్రం తొలి నివేదికన్నా పెరిగినట్లు చూపించారు. తొలుత 12.15 లక్షల కోట్లు జివిఏగా ఖరారు చేయగా, తాజాగా దానిని 12.24 లక్షల కోట్లుగా తేల్చారు.

వ్యవసాయం తగ్గింది

మూడు కీలక రంగాల్లో ఒకటైన వ్యవసాయంలో విలువ తగ్గినట్లు చూపించడం గమనార్హం. తొలి నివేదికలో 4,39,645 కోట్లుగా ఉన్న విలువను తాజా నివేదికలో 4,27,961 కోట్లుగా చూపించారు. . అంటే కొద్ది రోజుల్లోనే 11,684 కోట్ల విలువ తగ్గినట్లు చూపించడం విశేషం. ఇదే సమయంలో మరో కీలకమైన సేవ రంగంలో కూడా తగ్గుదలను చూపించడం విశేషం. తొలి నివేదికలో 4.91 లక్షల కోట్లుగా చూపించిన అధికారులు తాజా నివేదికలో మాత్రం 4.80 లక్షల కోట్లుగానే తగ్గించి చూపించారు. అయితే పారిశ్రామిక రంగంలో మాత్రం ప్రగతి భారీగా పెరిగినట్లు మార్చి చూపించారు. తొలి నివేదిక కన్నా 31 వేల కోట్ల వరకు విలువ పెరిగినట్లు చూపించడం విశేషం.

ప్రస్తుత ధరల మేరకు పలు రంగాల్లో వృద్ధి వివరాలు ఇవే (రూ. కోట్లలో)

విభాగం	2022-23 పాత నివేదిక	2022-23 కొత్త నివేదిక	2023-24	వృద్ధి(%)
జిఎస్‌డిపి	13,17,728	13,03,524(-)	14,39,674	10.44
జివిఏ	12,14,961	12,23,691(+)	13,29,124	8.62
వ్యవసాయం	4,39,645	4,27,961(-)	4,53,807	6.04
ఇండస్ట్రీ	2,83,821	3,148,56(+)	3,41,484	8.46
సేవారంగం	4,91,496	4,80,874(-)	5,33,833	11.01



టవర్‌క్లాక్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టిన డిఎస్‌సి అభ్యర్థులు, డివైఎఫ్ఐ నాయకులు

మినీ కాదు...మెగా డిఎస్‌సి కావాలి

- డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో అనంతపురం కలెక్టరేట్ ముట్టడి
- భారీగా తరలివచ్చిన డిఎస్‌సి అభ్యర్థులు
- ఉద్రిక్తత...పలువురి అరెస్ట్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

మినీ డిఎస్‌సి కాదు..మెగా డిఎస్‌సి కావాలని డిమాండ్ చేస్తూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో డిఎస్‌సి అభ్యర్థులు అనంతపురం జిల్లా కలెక్టరేట్‌ను శనివారం ముట్టడించారు. దీంతో కలెక్టర్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన డిఎస్‌సి అభ్యర్థులు నగరంలోని టవర్‌క్లాక్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. తాము మెగా డిఎస్‌సి నిర్వహించాలని కోరితే ప్రభుత్వం దగా డిఎస్‌సి నిర్వహిస్తోందని ర్యాలీలో పాల్గొన్న వారు విమర్శించారు. మెగా డిఎస్‌సి కావాలంటూ చేసిన నినాదాలు మారుమ్రోగాయి. కలెక్టరేట్ వద్దకు చేరుకోగానే అప్పటికే అక్కడ ఉన్న పోలీసులు వీరిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో వారిని తోసుకుంటూ లోపలికి వెళ్లే ప్రయత్నం చేశారు. పోలీసులు అడ్డుకోవడంతో అక్కడే భైఠాయించి తమకు న్యాయం చేయాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో వారిని పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ చేసి అక్కడ నుండి తరలించారు. అనంతరం సొంతపూచీకత్తుపై వారిని విడుదల చేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్న, జిల్లా అధ్యక్షులు వై. బాలకృష్ణ మాట్లాడుతూ.. అదిగో మెగా డిఎస్‌సి అంటూ ఊరిస్తూ చివరకు మినీ డిఎస్‌సి ప్రకటించి, నిరుద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం నయవంచన చేసిందని విమర్శించారు. కేవలం 6100 పోస్టులను మాత్రమే భర్తీ చేస్తామని ప్రకటించడం సరికాదన్నారు. ఇప్పటికే మెగా డిఎస్‌సి కోసం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అనేక రూపాల్లో ఆందోళనలు నిర్వహించామని గుర్తు చేశారు. ఈ సందర్భంగా వందలాది మందిపై ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించిందే తప్ప మెగా డిఎస్‌సి ప్రకటించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డిఎస్‌సి అభ్యర్థుల ఆవేదనను దృష్టిలో ఉంచుకుని నోటిఫికేషన్ నాటికి రిటైర్డ్ అవుతున్న ఉపాధ్యాయుల సంఖ్యను ఇందులో చేర్చి పోస్టులు సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. కొత్తగా రెండేళ్ల అప్రెంటిష్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకురావడం దారుణమన్నారు. మెగా డిఎస్‌సి కోసం ఆందోళనలు కొనసాగుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌సి అభ్యర్థులు పాల్గొన్నారు.

మార్కెట్లోకి కొత్త కెమెరా లెన్స్

ప్రజాశక్తి - అమరావతి


చైనా సంస్థ ఆస్ట్రోహోరి నుంచి మార్కెట్లోకి కెమెరా మైక్రోలెన్స్ మార్కెట్లోకి విడుదలైంది. ఆస్ట్రో 25 ఎంఎం ఎఫ్2.8పుల్ ఫ్రేమ్ మిర్రర్‌లెస్ కెమెరాల కోసం దీనిని రూపొందించారు. అతి తక్కువ ధరలో మార్కెట్లోకి విడుదలయ్యింది. ఈ లెన్స్ సోని, ఫ్యూజీ, నికాన్, కెనాన్ మిర్రర్‌లెస్ కెమెరాలకు ఉపయోగపడేలా సరికొత్తగా రూపొందించారు. ఆర్ట్ ఫొటోగ్రాఫర్లకు ఇది చాలా ఉపయోగకరంగానూ, అతి తక్కువ ధరలోనూ మార్కెట్లో దొరుకుతోంది. 20,660 రూపాయలుగా దీని ధర నిర్ణయించారు.ఈ కెమెరాలో

2.1 నుంచి 5.1 మేగ్నిఫికేషన్ పరిధిలో ఎక్సెల్ అందుతుంది. క్లోజప్ ఫొటోలకు, చిన్న చిన్న మైక్రోస్కోపిక్ చిత్రాలతో, చిన్నపాటి క్రిమికీటకాల ఫొటోలను సైతం చక్కగా బంధించొచ్చు.8 బ్లేడ్ డయాఫ్రాగమ్ లెన్స్ డిజైన్‌తో దీనిని తయారుచేశారుఅవుటాఫ్



ఫోకస్ కళాత్మకతతో నాణ్యమైన ఫొటోలు తీసుకోవచ్చుబ్యాక్‌గ్రౌండ్ బ్లర్ అయ్యేటట్లుగా కూడా తీయొచ్చు

పేటియం బ్యాంక్ ఇక మూత..?



న్యూఢిల్లీ : పేటియం పేమెంట్ బ్యాంక్ ఫిబ్రవరి 29 తర్వాత మూతపడొచ్చని రిపోర్టులు వస్తోన్నాయి. విజయ్ శేఖర్ శర్మకు చెందిన ప్రముఖ డిజిటల్ చెల్లింపుల వేదిక పేటియం ద్వారా భారీ మొత్తాల్లో మనీలాండరింగ్ జరిగిందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల పేటియంకు చెందిన పేటియం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ (పిపిబిఎల్)పై ఆర్‌బిఐ వేటు వేసిన విషయం తెలిసిందే. నో యువర్ కస్టమర్ (కెవైసి) నిబంధనలు పాటించకుండా మనీలాండరింగ్‌కు తావిచ్చిందని సమాచారం. పిపిబిఎల్ ద్వారా వందల కోట్ల రూపాయల సందేహాస్పద లావాదేవీలు జరగడంతోనే ఆర్‌బిఐ తీవ్ర చర్యలకు పాల్పడిందని రాయిటర్స్ ఓ కథనం ప్రచురించింది.పేటియం పేమెంట్స్ బ్యాంక్ కొత్త ఖాతాదారు లను తీసుకోకూడదని ఆర్‌బిఐ ఆదేశించింది. ఫిబ్రవరి 29 నుంచి అదనపు డిపాజిట్లు, రుణ లావాదేవీలు, టాప్ అప్‌లు లేదా కస్టమర్ అకౌంట్‌లు, ప్రీపెయిడ్ ఇన్‌స్ట్రుమెంట్‌లు, వాలెట్‌లు, ఫాస్ట్‌ట్యాగ్ తదితర వాటిలో ఏవైనా సంబంధిత లావాదేవీలను నిలిపివేయాలని ఆదేశించింది. వడ్డీ, క్యాష్‌బ్యాక్‌లు లేదా రీఫండ్‌లను క్రెడిట్ చేయడం వంటి వాటికి మాత్రమే మినహాయింపు కల్పించింది. దీనర్థం ఖాతాదారులు ప్రస్తుత డిపాజిట్లను ఉపసంహరించుకోవడం సహా.. ఫిబ్రవరి 29 వరకు వారి వాలెట్‌లలో నిల్వ చేసిన డబ్బుతో సేవలను ఉపయోగించుకోవచ్చు. ఆ తర్వాత లావాదేవీలను పూర్తిగా నిలిపివేయవచ్చని స్పష్టం అవుతోంది. ఈ పరిణామం పిపిబిఎల్‌పై నిషేధానికి దారి తీయొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

లక్షల సంఖ్యలో తప్పుడు కెవైసి ఖాతాలున్నాయి. కొన్ని వేల సందర్భాల్లోనూ ఒకే పాన్ కార్డును బహుళ ఖాతాలకు ఉపయోగించినట్లు తెలుస్తోంది. కనీస నియంత్రణ పరిమితిని మించి కోట్లాది రూపాయల లావాదేవీలు జరిగినట్లు.. ఇవి మనీలాండరింగ్‌కు దారి తీశాయని సమాచారం. పేటియం పేమెంట్స్ బ్యాంక్‌లో దాదాపు 35 కోట్ల ఇ-వాలెట్లు ఉన్నాయి. ఇందులో, దాదాపు 31 కోట్లు నిద్రాణంగా ఉన్నాయి. అయితే కేవలం 4 కోట్లు మాత్రమే బ్యాలెన్స్ లేదా చిన్న నిల్వలతో నిర్వహణలో ఉన్నాయి. కాబట్టి కెవైసిల్లో పెద్ద అవకతవకలు జరిగాయి. ఇది ఖాతాదారులు, డిపాజిటర్లు, వాలెట్ హోల్డర్లను తీవ్రమైన ప్రమాదానికి గురి చేసిందని ఓ అధికారి పేర్కొన్నారు.

పేటియం పేమెంట్ బ్యాంక్‌లో 2021లోనే తీవ్రమైన కెవైసి, యాంటీ మనీ లాండరింగ్ ఉల్లంఘనలను గుర్తించింది. ఈ లోపాలను పరిష్కారించాలని ఆ సంస్థను ఆదేశించినప్పటికీ పక్కన పెట్టిందని సమాచారం. పిపిబిఎల్ సమర్పించిన దస్త్రాలు చాలా సందర్భాల్లో అసంపూర్తిగా, తప్పుగా ఉన్నట్లు రెగ్యూలేటర్ గుర్తించిందని తెలుస్తోంది. ఈ పరిణామాల వల్లే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సెప్టెంబర్ 2022లో పిపిబిఎల్, దాని మాతృసంస్థ వన్ 97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్, ఇతర చెల్లింపు అగ్రిగేటర్ల ప్రాంగణాల్లో సోదాలు నిర్వహించింది. ఇప్పటికీ ఆ సంస్థ వ్యవహారం మారకపోవడంతో అవసరమైతే, మనీలాండరింగ్ ఆరోపణలపై ఇడి దర్యాప్తు చేయొచ్చని ఓ అధికారి పేర్కొన్నారు. ఆర్‌బిఐ తాజా చర్యల పరిణామంతో కాగా రెండు రోజుల్లో పేటియం షేర్లు భారీగా క్షీణించాయి. శుక్రవారం సెషన్‌లో 20 శాతం కోల్పోయి రూ.487.20 వద్ద ముగిసింది. ఇంతక్రితం సెషన్‌లో రూ.608 వద్ద నమోదయ్యింది.

వైఎస్సార్‌సిపి సభలు పెట్టుకుంటే సిపిఎంపై ఆంక్షలు అన్యాయం

- రాష్ట్ర కమిటీ ఖండన

అమరావతి బ్యూరో: దెందులూరులో వైఎస్సార్‌సిపి 'సిద్ధం' సభకు ముఖ్యమంత్రి హాజరవుతున్న సందర్భంగా ఏలూరులో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవిని హౌస్ అరెస్టు చేయడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ ఖండించింది. ఈ మేరకు శనివారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రకటన విడుదల చేశారు. రవితో పాటు మరికొందరు సిఐటియు కార్మిక నాయకులను కూడా దిగ్బందించారని, దీనికి కారకులైన పోలీసు అధికారులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో అన్నిపార్టీలకూ రాజ్యాంగ రీత్యా సమానమైన అవకాశాలున్నాయని, కానీ ఒకపార్టీ సభ పెట్టుకుంటే మరొక పార్టీ నాయకులను అరెస్టు చేయడమంటే అది నిరంకుశ రాజ్యమవుతుందని విమర్శించారు. ఎన్నికలు రానున్న తరుణంలో ఇలాంటి అప్రజాస్వామిక చర్యలను అరికట్టేందుకు ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని కోరారు.

సిపిఎం, సిఐటియు నేతల నిర్బంధం



సిపిఎం ఏలూరు కార్యాలయం నుంచి బయటకు వెళ్లకుండా రవి, కిషోర్‌ను ఆపిన పోలీసులు

ప్రజాశక్తి - ఏలూరు జిల్లా యంత్రాంగం

వైసిపి తలపెట్టిన 'సిద్ధం' సభను అడ్డుకుంటారనే పేరుతో ఏలూరు జిల్లా పోలీసులు సిపిఎం, సిఐటియు, ప్రజాసంఘాల నేతలను నిర్బంధించారు. సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, నగర కార్యదర్శి పి.కిషోర్‌లను ఏలూరులోని సిపిఎం జిల్లా కార్యాలయం వద్ద, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్‌ను సిఐటియు జిల్లా కార్యాలయం వద్ద, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.నరసింహను నూజివీడు మండలం గొల్లపల్లిలో గృహనిర్బంధంలోఉంచారు. పలువురు నేతలకు నోటీసులు ఇవ్వడం, ఫోన్లు చేసి హెచ్చరించడం వంటి చర్యలు చేపట్టారని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనలు ఎప్పుడు జరిగినా ప్రభుత్వం ఈ రకంగా వ్యవహరించడం వారి పిరికితనానికి నిదర్శనమన్నారు. ప్రశ్నించే నాయకులను నిర్బంధించడం మాని, ప్రజా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దెందులూరులో సిఎం సభ నేపథ్యంలో టిఎన్‌ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పెనుబోయిన మహేష్‌యాదవ్‌ను దెందులూరు పోలీసులు గృహనిర్బంధం చేశారు.

'ప్రజా నాట్యమండలి'కి రూ.50వేలు విరాళం

అమరావతి బ్యూరో : విజయవాడసున్నపు బట్టీల సెంటర్ గుంటూరు బాపనయ్య నగర్‌లో ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యాలయం నిర్మాణానికి ప్రజారచయిత, ప్రజానాట్యమండలి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు బి.చైతన్య ప్రసాద్ రూ.50వేలు భారీ విరాళం ప్రకటించారు. విజయవాడలోని ఎంబివికెలో జరుగుతున్న ప్రజా రచయితల రాష్ట్ర స్థాయి వర్క్‌షాపులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు చేతుల మీదుగా విరాళాన్ని ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్ అనిల్‌కుమార్, అధ్యక్షులు పి.మంగరాజు, ఉపాధ్యక్షులు గాదె సుబ్బారెడ్డిలకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా విఎస్ఆర్ మాట్లాడుతూ ప్రజా కళారూపాల సృష్టికి ప్రజానాట్యమండలి కార్యాలయం కేంద్రంగాఉపయోగపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు మంతెనసీతారామ్, ప్రజానాట్యమండలి ఉమ్మడి రాష్ట్ర నాయకులు కె.దేవేంద్ర, రాష్ట్ర నాయకులు ఐవి సుభాషిణి, పెద్దిరాజు, కవి పాల్గొన్నారు.

సంపాదకీయం


చేతిరాత

అందమైన చేతిరాత కోసం చిన్నప్పుడు కాపీ బుక్కులు నింపిన జ్ఞాపకం. ముత్యాలు పేర్చినట్టుగా వుండే అక్షరాలను చూసుకొని మురిసిపోయిన జ్ఞాపకం. ఇప్పుడు సంతకం కూడా కుదురుగా రాయలేకపోవడాన్ని తలచుకుని వగచడం వాస్తవం. ఇది చాలామందికి అనుభవం. రాసే అక్షరం, చేసే సంతకం ఇప్పుడు అష్టవంకరలు పోతోంది. ఇమెయిల్స్, బ్లాగ్‌లు, సోషల్ మీడియా వచ్చిన తర్వాత ఉత్తరాలు, డైరీలు రాసే అలవాటు తప్పిపోయింది. 'చేతిరాత గుండె కదలికకు మరింత అనుసంధానించబడి వుంది' అంటారో రచయిత్రి. పూర్వం తల్లిదండ్రులు తమ పిల్లలతో శ్రద్ధగా ఒరవడి రాయించేవారు. ప్రస్తుతం ర్యాంకులపై పెట్టే శ్రద్ధ.. చేతిరాత విషయంలో చూపడంలేదు. 'పిల్లల చేతిరాత అందంగా వుండేలా ప్రోత్సహిస్తే, వారి వ్యక్తిత్వ వికాసానికి, మానసిక ఆరోగ్యానికి తోడ్పడుతుంది' అంటారు చిత్రకారుడు, కవి ఆత్మకూరు రామకృష్ణ. అనేక గ్రంథాలను పరిశోధించి, చేతిరాతను ఎలా మెరుగుపర్చుకోవాలో శాస్త్రీయ పద్ధతిలో వివరించారు 'హస్తలేఖనం ఓ కళ' అనే గ్రంథంలో. అందమైన చేతిరాత ఓ ప్రత్యేక నైపుణ్యం మాత్రమే కాదు, అది అభ్యసన ప్రక్రియలో ఓ భాగం' అంటారు వాండర్ బిల్ట్ యూనివర్శిటీకి చెందిన నిపుణులు. 'సాధనమున పనులు సమకూరు ధరలోన' అన్నట్లుగా చేతిరాత మెరుగుదలకు నిత్య సాధన ఎంతో అవసరం.

ఈ డిజిటల్ యుగంలో రాసేవారి సంఖ్య చాలావరకు తగ్గిపోయింది కానీ, ఒకప్పుడు చేతిరాతకి చాలా ప్రాముఖ్యత వుండేది. టాల్‌స్టాయ్ తన 'యుద్ధము-శాంతి' నవలను అనేక పర్యాయాలు తిరగశారాడట. ఇంగ్లీషులో ఎమిలీ డికెన్‌సన్ కవితల సంపుటాలు ఆమె చేతిరాతవే అచ్చేశారు. ఇలియట్, కీట్స్, వాల్ట్ విట్‌మన్, రిచర్డ్ బాష్ వంటి ప్రముఖుల రచనలు వారి చేతిరాత ప్రతులనే అచ్చువేశారు. హిందీ రచయితలలో మహాదేవివర్మ 'దీప్‌శిఖా' ఆమె చేతిరాతతో అచ్చయింది. గురజాడ వారి 'కన్యాశుల్కం', శీలా వీర్రాజు 'కిటికీ కన్ను', మహాకవి శ్రీశ్రీ 'మహాప్రస్థానం' వారి చేతిరాతతోనే ప్రచురించబడగా, శ్రీరమణ 'మిథునం' బాపూ స్వదస్తూరితో ముద్రితమైంది. అలాగే కొందరు సినారె, ఇంద్రగంటి శ్రీకాంతశర్మ, నగ్నముని, నార్ల, గురజాడ, కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, దాశరథి వంటి 182 మంది కవుల చేతిరాత ప్రతులతో 'పొయిట్రీ వర్క్‌షాప్' పేరుతో కవితా సంకలనాన్ని ప్రచురించారు. అచ్చు యంత్రానికి ముందున్న మహాగ్రంథాలన్నీ గతకాలపు మహాకవుల చేతిరాతలే. చేతిరాతలకు ఇంతటి గొప్ప చరిత్ర వుంది. అయితే, ఆధునికులలో సగటున ఓ వ్యక్తి 41 రోజులకు గాని నాల్గు లైన్లు రాయాల్సిన అవసరం గాని, ప్రతి ముగ్గురిలో ఒకరికి 6 నెలల పాటు కలం పట్టే అవసరంగాని రావడం లేదట. ఇక ప్రతి ఏడుగురిలో ఒకరు తమ చేతిరాత అవమానకరంగా మారిపోయిందని వాపోతున్నారంటూ బ్రిటిష్ కంపెనీ డాక్మెయిల్ సర్వే తేల్చింది.

కీబోర్డ్‌పై టైప్ చేయడం కంటే, చేతితో రాయడం వల్ల నేర్చుకునే సామర్థ్యం, జ్ఞాపకశక్తి పెరుగుతాయని ఒక అధ్యయనంలో వెల్లడైంది. 'కీబోర్డ్ మీద టైపింగ్‌తో పోలిస్తే చేత్తో రాస్తున్నప్పుడు మెదడు అనుసంధానం మరింత విస్తృతంగా ఉంది. ఈ అనుసంధానం జ్ఞాపకశక్తికి, కొత్త సమాచారాన్ని విశ్లేషించడానికి కీలకం. నేర్చుకొనేందుకు ప్రయోజనకరం' అని నార్వేజియన్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రొఫెసర్ తెలిపారు. చేతిరాత, టైపింగ్ సమయంలో నాడీ సంబంధమైన నెట్‌వర్క్‌ను పరిశీలించిన అనంతరం ఈ విషయాన్ని వెల్లడించారు. టైపింగ్ కూడా మంచిదే అయినప్పటికీ, చేతిరాతతో పోల్చినప్పుడు నేర్చుకునే సామర్థ్యం తక్కువగా వుందని పరిశోధకులు నిర్ధారణకు వచ్చారు. 'రోజులో కనీసం 20 నిమిషాల పాటు మన ఎమోషన్స్‌ని చేతిరాతలో వ్యక్తీకరించడం వల్ల డిప్రెషన్‌ను జయించవచ్చు' అని ప్రముఖ రచయిత్రి హర్షదా పవారే చెబుతున్నారు. ఇక 'రాయడం వల్ల మన ఆలోచనల్లో ఏకాగ్రత పెరుగుతుందని' మిచిగాన్ స్టేట్ యూనివర్శిటీ పరిశోధకులు కూడా వెల్లడించారు. ఆలోచనలకు అక్షరరూపం ఇవ్వడం, చిన్నచిన్న కథలు, ఉత్తరాలు రాయడం, నిద్రకు ముందు కాసేపైనా డైరీ రాయడం అలవాటుగా మార్చుకోవాలి. మనకు ఇష్టులైన వారికి స్వదస్తూరితో రాసి శుభాకాంక్షలు చెబితే మరింత తృప్తిగానూ వుంటుంది కదా.

మహనీయుల మాట



దేశాభివృద్ధి అంటే అద్దాల మేడలు, రంగుల గోడలు కాదు. ప్రతి పౌరుని నైతికాభివృద్ధి.
- డా॥ బి.ఆర్.అంబేద్కర్, భారత రాజ్యాంగ నిర్మాత.

B R Ambedkar

మొత్తం మోడీ మహాత్మ్య కీర్తనలేనా?

ప్రస్తుతం



తెలకపల్లి రవి

జనవరి 22న అయోధ్యలో రామాలయ ప్రాణ ప్రతిష్ట జరిగింది నిజమే కానీ ఆ రోజుతో చరిత్ర ఆగిపోదు అని సీనియర్ ఎడిటర్ శేఖర్ గుప్తా వ్యాఖ్యానించారు. నిజం. రాజకీయాలలో ఒక పరిణామం తీవ్రతను గుర్తించడం వేరు, అంతటితో అయిపోయిందనీ అదే అన్నిటినీ నిర్ణయిస్తుందని అనుకోవడం పొరబాటు. దురదృష్టవశాత్తూ ఇప్పుడు బడా మీడియా రోజుకు రోజు అలాంటి కబుర్లే కుమ్మరిస్తుంటుంది. కొత్త కొత్త పదజాలాలతో పక్కదోవ పట్టిస్తుంటుంది. అంతర్జాతీయ స్థాయిలో గ్లోబల్ మీడియా ఏ విధంగా అన్ని విషయాలూ సామ్రాజ్యవాద కోణంలో ఇస్తుందో...దేశంలో బడా మీడియా కూడా ప్రతిదీ మోడీ మహత్తర విజయంగా అభివర్ణిస్తుంటుంది (అదే రాష్ట్రాలలో అయితే వారి వారి ఎంపికల ప్రకారం చేస్తుంటుంది గానీ ఆ ముచ్చట మరోసారి). మూడు రాష్ట్రాలలో బిజెపికి మెజార్టీ రావడంతో హ్యాట్రిక్ ఖాయమని తేల్చేసింది. ఇందాక చెప్పుకున్న రామమందిరం ప్రాణప్రతిష్టతో తిరుగులేదని చెప్పింది. ఆ పిమ్మట బీహార్‌లో నితీష్ కుమార్ సరికొత్త ఊసరవెల్లి వేషాలతో 'ఇండియా' వేదిక పని అయిపోయిందని నిర్ణయించింది. అదే సమయంలో బెంగాల్‌లో మమతా బెనర్జీ కాంగ్రెస్‌కు సీట్లు ఇచ్చేది లేదని చెప్పడంతో మీడియా మరింత రెచ్చిపోయింది. ఇందులో ప్రతి అంశాన్ని ఒక్క వైపు నుంచే చూపిస్తూ అంతా మోడీకి అనుకూల దిశలోనే జరిగిపోతున్నట్టు చిత్రించడానికి నానా పాట్లు పడుతున్నది. అందుకు తగినట్టే స్వతంత్ర ఆర్ణబ్ లు లోకల్ ఆర్ణబ్ ల వంటి స్టార్ వ్యాఖ్యాతలు మోడీ అద్భుత జనరంజక శక్తికి కీర్తనల జోరు పెంచుతున్నారు. ఈ ప్రక్రియ లోక్‌సభ ఎన్నికల ఫలితాల వరకూ ఆగేది కాదు. తర్వాతి ఘట్టం ప్రజల తీర్పుపై ఆధారపడి వుంటుంది.

నితీష్ ప్రహసనం నిజాలేమిటి?

బిజెపి ఎన్నికల విజయాలు, కొంతమంది నేతల ఫిరాయింపులు నిజమే. కానీ నాణేనికి మరోవైపు చూడవలసిన పనిలేదా? ఉదాహరణకు బీహార్‌లో నితీష్ కుమార్ ఫిరాయింపు కొత్తేమీ కాదు, అనుకోనిదీ కాదు. ఆయన పేరులో మొదటి అక్షరానికి దీర్ఘం లేదని అందరికీ తెలుసు. కాని 2019 ఎన్నికల నాటికి ఆయన బిజెపితో కలిసే పోటీ చేశారు. అత్యధిక లోక్‌సభ సీట్లు వాళ్లకే వచ్చాయి. కనుక రాజకీయంగా 'ఇండియా'కు దెబ్బ అనడం సరైందే గానీ ఇప్పుడు కొత్తగా కలిగే నష్టం లేదు. ఆయన అలా చేస్తాడనేది అందరి దృష్టిలో వున్నదే. అసలు 'ఇండియా' పేరిట హడావుడి చేస్తున్న సమయంలో కూడా ఎవరూ పెద్దగా విశ్వసించింది లేదు. కాకపోతే దేశంలో పెద్ద రాష్ట్రాలలో ఒకటైన బీహార్‌కు ఉత్తర భారతంలో ప్రభావశీల ప్రదేశంగా ప్రత్యేక స్థానముంది గనక లౌకిక పార్టీలు ఆయన రాకను ప్రోత్సహించాయి. నిజానికి 2019 లోక్‌సభ ఎన్నికల తర్వాత 2020లో జరిగిన శాసనసభ ఎన్నికల నాటికే నితీష్ బలం గణనీయంగా క్షీణించింది. ఆ ఎన్నికల్లో ఆర్‌జెడి కి 79, బిజెపికి 78 రాగా జెడియు కేవలం 45 మాత్రమే తెచ్చుకున్నది. 19 స్థానాలతో కాంగ్రెస్, 16 స్థానాలతో వామపక్షాలు ఇంకా బలంగా వున్నాయి. ఇప్పుడు నితీష్ కేవలం బిజెపి కీలుబొమ్మలానే బతకాల్సి వుంటుంది. 'ఇండియా' తరపున తనను ప్రధాని అభ్యర్థిగా ప్రకటించబోరని తెలిసిన తర్వాతే ఆయన ప్లేటు ఫిరాయించాలని నిర్ణయించుకున్నాడు. మామూలుగా అయితే మీడియా దీన్ని చీల్చి చెండాడాలి. ఆ విధంగా ఊసరవెల్లి చందం అని రాయడం చెప్పడం జరిగింది గాని ప్రధాన దాడి 'ఇండియా' విచ్ఛిన్నంపైనే పెట్టారు. 2022లో తమను ఈసడించుకుని వెళ్లిన నేత తిరిగివస్తే బిజెపి ఎలా అక్కున చేర్చుకుని అధికారమిచ్చిందనేది మాత్రం ప్రశ్నించిన పాపాన పోలేదు.

మరోవైపు పరిణామాలు

నిజానికి ఇదే సమయంలో పక్కనున్న అతి పెద్ద రాష్ట్రం ఉత్తర ప్రదేశ్‌లో అఖిలేశ్ యాదవ్ సమాజ్‌వాది పార్టీ కాంగ్రెస్‌కు 11 స్థానాలు కేటాయిస్తున్నట్టు ప్రకటించింది. కాంగ్రెస్ మరిన్ని సీట్లు కోరుతున్న మాట నిజమే గాని ఈ మాత్రం సర్దుబాటు చిన్నదేం కాదు. ఆప్ నాయకుడు కేజ్రీవాల్ హర్యానాలో తాము వంటరిగా పోటీ చేస్తామంటూనే లోక్‌సభలో మాత్రం కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంటామన్నారు. ఇక రాజకీయంగా మరింత కీలకమైన పశ్చిమ బెంగాల్ విషయానికి వస్తే అక్కడ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ టిఎంసితో పొత్తు వద్దనే వైఖరి తీసుకుంది సిపిఎం. ఇటీవలి కాలంలో షహీద్ మినార్ మైదాన్‌లో యువత అపూర్వమైన బహిరంగ సభ కూడా జరిపింది. 'ఇండియా' లోని కాంగ్రెస్‌తో తప్ప సిపిఎంతో తమకు కుదరదని తృణమూల్ కూడా ప్రకటించింది. అయితే అంతా అయ్యాక మమత కాంగ్రెస్‌కు కేవలం రెండంటే రెండు లోక్‌సభ సీట్లే కేటాయిస్తానన్నది. మాల్దా దక్షిణం, బెర్హంపూర్ అనే ఆ రెండు ఇప్పటికీ కాంగ్రెస్ చేతుల్లోనే వున్నాయి. కనుక వారు కూడా అంగీకరించలేదు. ఈ సమయంలో రాహుల్ గాంధీ న్యాయ జోడో యాత్ర వచ్చినపుడు కూడా తృణమూల్ వర్గీయుల రాళ్లు విసిరి దౌర్జన్యం చేశారు. మరోవంక సిపిఎం నాయకులు సభలో పాల్గొని సంఘీభావం తెలిపారు. రాహుల్ గాంధీ మాత్రం తాము ఇప్పటికీ ఆ పార్టీతో సీట్ల సర్దుబాటు చర్చలు జరుపుతున్నామన్నారు. కేరళలో ఎల్‌డిఎఫ్ యుడిఎఫ్ ఎప్పుడూ వేరు వేరుగానే పోటీ పడుతున్నాయి. కనక ఇక్కడ రాజకీయంగా గానీ సీట్ల రీత్యా గానీ నష్టపోయింది లేదు. పైగా ఒక్క యు.పి మినహా ఇవేవీ బిజెపి పాలనలోని రాష్ట్రాలూ కాదు. అందువల్ల బీహార్ పరిణామాలతో 'ఇండియా' అతలాకుతలం అయిపోయినట్టు అంతా తిరగబడినట్టు చెప్పడం దురుద్దేశపూరితం. ఇప్పుడు వారు గెలిచిన మూడు రాష్ట్రాలలో కూడా బిజెపికి 39 స్థానాలుంటే కాంగ్రెస్‌కు కేవలం రెండే వున్నాయి. అందువల్ల కొత్తగా ఏమొచ్చినా లాభమే గాని నష్టపోయేది వుండదు. ఇవన్నీ వాస్తవికమైన ఆధార సహిత విషయాలయినప్పుడు మోడీ ఏదో అపారబలం పుంజుకున్నట్టు మిగిలిన పార్టీలన్నీ భయంతో వణికి పోతున్నట్టు మీడియా చెప్పడం ఎంత దారుణం?

> అంతర్జాతీయ స్థాయిలో గ్లోబల్ మీడియా ఏ విధంగా అన్ని విషయాలూ సామ్రాజ్యవాద కోణంలో ఇస్తుందో...దేశంలో బడా మీడియా కూడా ప్రతిదీ మోడీ మహత్తర విజయంగా అభివర్ణిస్తుంటుంది. మూడు రాష్ట్రాలలో బిజెపికి మెజార్టీ రావడంతో హ్యాట్రిక్ ఖాయమని తేల్చేసింది. ఇందాక చెప్పుకున్న రామమందిరం ప్రాణప్రతిష్టతో తిరుగులేదని చెప్పింది. ఆ పిమ్మట బీహార్‌లో నితీష్ కుమార్ సరికొత్త ఊసరవెల్లి వేషాలతో 'ఇండియా' వేదిక పని అయిపోయిందని నిర్ణయించింది. అదే సమయంలో బెంగాల్‌లో మమతా బెనర్జీ కాంగ్రెస్‌కు సీట్లు ఇచ్చేది లేదని చెప్పడంతో మీడియా మరింత రెచ్చిపోయింది. ఇందులో ప్రతి అంశాన్ని ఒక్క వైపు నుంచే చూపిస్తూ అంతా మోడీకి అనుకూల దిశలోనే జరిగిపోతున్నట్టు చిత్రించడానికి నానా పాట్లు పడుతున్నది. అందుకు తగినట్టే స్వతంత్ర ఆర్ణబ్‌లు, లోకల్ ఆర్ణబ్ ల వంటి స్టార్ వ్యాఖ్యాతలు మోడీ అద్భుత జనరంజక శక్తికి కీర్తనల జోరు పెంచుతున్నారు. ఈ ప్రక్రియ లోక్‌సభ ఎన్నికల ఫలితాల వరకూ ఆగేది కాదు. తర్వాతి ఘట్టం ప్రజల తీర్పుపై ఆధారపడి వుంటుంది.

నిజంగా ఏకపక్షమా?

తెలంగాణలో బిఆర్ఎస్ అనేక మల్లగుల్లాలు పడినా ప్రజలు మాత్రం బిజెపికి అవకాశం నిరాకరించి కాంగ్రెస్‌ను ఎన్నుకోలేదా? అలాగే రామమందిరం వ్యవహారం బిజెపికి బాగా మేలు చేయొచ్చు గాని మతరాజ్య భావన వచ్చిందనే భావన కూడా రావడంతో ఏదో ఒక మేరకు వ్యతిరేక ఓట్లు కూడా పెరగవా? అంతా అనుకూలంగా వుంటే నితీష్‌ను మళ్లీ ఎందుకు రానిచ్చేవారు? బెంగాల్‌లో మమతా బెనర్జీ కాంగ్రెస్‌కు సీట్లు నిరాకరించారు గనక వెంటనే బిజెపితో పాటు ఆమెనూ ఎక్కువ చేసి చూపుతున్నారు గానీ ఆమె 'ఇండియా'ను బలపర్చినప్పటి మాటేంటి? ఆమె తనే ప్రధాని కావాలనే ఆశతో అడ్డంకులు సృష్టించినప్పుడు వాటిని పెద్దగా చూపించిందీ వీరే కదా? మమత, కెసిఆర్, కేజ్రీవాల్ ఎవరూ కలసిరారని, బిజెపి వ్యతిరేక కూటమి వట్టి మాట అని అన్నవారు ఏదో విధంగా 'ఇండియా' ఏర్పడిన తర్వాత నాలుక కరుచుకోక తప్పలేదు. సిపిఎం వరకూ ఇది కేవలం బిజెపి మతతత్వంపై, కేంద్ర నిరంకుశత్వంపై పోరాడే ఒక వేదిక తప్ప కూటమి కాదని చెబుతూనే వుంది. ఆ మాట కొస్తే ఒక నిర్మాణ రూపం వద్దని కూడా సూచించింది. మల్లికార్జున ఖర్గేను చైర్మన్‌గా ప్రకటించిన రోజునే నితీష్ నిష్క్రమణ ఖాయమై పోయింది. దాంతో ఆయనను నియమించకపోవడమే సరైందని అప్పుడే అర్థమైంది. అందుకే 'ఇండియా'లో సభ్యత్వం గల పార్టీలేవీ నితీష్ కోసం విచారించింది లేదు! ఆయన గురించిన అంచనా అది. రేపటి ఎన్నికల్లో కూడా 45 అసెంబ్లీ స్థానాలు గల ఆయన వెళ్లిపోయినా ఆర్‌జెడి, కాంగ్రెస్, వామపక్షాల బలంతో గట్టిగా సవాలు చేయడం తథ్యమే. పక్కనే వున్న జార్ఖండ్‌లో మాజీ ముఖ్యమంత్రి హేమంత సోరెన్‌పై ఇ.డి దాడులతో అరెస్టు చేయడం ప్రతిపక్షాలను బెదిరించే కుట్రలలో భాగమే. బీహార్‌లో లాలూ కుటుంబాన్ని, కర్ణాటకలో ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్‌నూ, ఢిల్లీలో కేజ్రీవాల్‌నూ ఇంకా ఎందరినో ఈ విధంగానే వేటాడటంలో ఆంతర్యం అదే. వారిలో ఎవరైనా ఏదైనా తప్పు చేశారా లేదా అనేది ఇక్కడ కీలకం కాదు, బిజెపిని గట్టిగా వ్యతిరేకించే రాజకీయ శక్తులను వేధించి అడ్డు లేకుండా చేసుకోవాలి. ఈ కేసులన్నిటినీ చాలా వివరంగా చిత్రించే బడా మీడియా బిజెపికి సంబంధించినవారిపై వచ్చిన ఆరోపణలను మాత్రం నామమాత్రంగా చెబుతుంది. ఎవరో ఎందుకు, అదానీ వార్తలే అమాంతం మారిపోయాయి. ఆయనపై అంతర్జాతీయంగా అనుమానాస్పద కథనాలు వచ్చినా విచారించింది లేకపోగా ఆదుకోవడానికే మోడీ ఆరాటపడ్డారు. ఆ క్రమంలో ఆయన లాభాలు గతం కంటే మరింత పెరిగాయనేది ఇప్పుడు మీడియాకు ఇష్టమైన స్టోరీ! కనుక సమాచారం వడపోత, మోడీ మోత ఏ స్థాయిలోవుంది తెలియడానికి ఈ ఉదాహరణ చాలదా?

కథ ఇంకా చాలా వుంది!

తాజాగా ప్రవేశపెట్టిన అనామతు బడ్జెట్ ఆర్థికంగా దేశ దుస్థితిని కళ్లకు కడుతున్నది. దేశం అంతగా దూసుకుపోతుంటే ఎన్నికల కోసమైనా ఏవైనా తాయిలాలు, పథకాల మోత మోగించేవారు కదా? ఎలాగో ప్రహసనం ముగించి మళ్లీ గద్దెక్కాలన్న ఆరాటం తప్పితే ప్రజానుకూల పథకాలు ఒకటైనా ప్రకటించగలిగిందా? ఓట్ల కోసమైనా రాష్ట్రాలకు మేలు చేసిందా? ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలలో ప్రత్యేక హోదా, పోలవరం వంటి వాటిని పట్టించుకోకపోగా వైసిపి, టిడిపి భుజాల పైకెక్కి తన పబ్బం గడుపుకునే తాపత్రయమే సాగుతున్నది. తెలంగాణలోనూ కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుందని బిఆర్ఎస్‌తో చెప్పిస్తూ మరోవైపు దాన్నీ బెదిరిస్తున్నది. తనతో వుందంటున్న జనసేనతోనూ దాగుడుమూతలాడుతున్నది. ఈ ప్రాంతీయ పార్టీలన్నీ కూడా స్థానిక అధికారం కోసమే పాకులాడుతూ కేంద్రాన్ని పల్లెత్తుమాట అనకుండా కీచులాడుకుంటున్న దుస్థితి. తెలంగాణలో అధికార పార్టీగా, ఎ.పి లో వైఎస్ షర్మిల నాయకత్వంలో కదలిక పెరిగిన పార్టీగా కాంగ్రెస్ కూడా బిజెపిపై సైద్ధాంతిక రాజకీయ పోరాటానికి ఎన్నికల సమరానికి విశాల కలయిక అవసరం పూర్తిగా గుర్తించడంలేదు. ఎ.పి లో అన్నాచెల్లెళ్ల తగాదా ప్రధానమైతే తెలంగాణలో బిఆర్ఎస్, కాంగ్రెస్ యుద్ధం ముఖ్యమైపోయింది. మొన్న మూడు రాష్ట్రాలలోనూ కాంగ్రెస్ అందరినీ కలుపుకుని వుంటే ఫలితాలు మారి వుండేవి. తెలంగాణలోనూ మెజార్టీ పెరిగి మరింత నిలకడ వచ్చేది. ఇలాంటి లోపాలు కాంగ్రెస్ వైపు, ఇతర ప్రాంతీయ పార్టీల వైపు వున్న మాట నిజమే గాని బిజెపికి తిరుగులేదనడం పాక్షిక సత్యం. బిజెపి యేతర బిజెపి వ్యతిరేక శక్తుల ఉమ్మడి బలం వారి కంటే ఎక్కువ. ఎన్‌డిఎ కూటమిలో చెప్పుకోదగిన పార్టీ కొత్తగా చేరిన జెడియు మాత్రమే. ఎన్నికల పోరాట ఫలితాన్ని ముందే చెప్పేసి చేతులెత్తేయమనడం దురుద్దేశ పూరితం. కథ ఇంకా వుంది. చేయవలసిందీ వుంది. ★

డా॥ జ్యోతి జీవితం స్ఫూర్తిదాయకం

నివాళి



కె. స్వరూపరాణి

డాక్టర్ సిరిపురపు జ్యోతి గొప్ప మానవతావాది. ఎనస్తీషియా వైద్యురాలి (ఎనస్తీషియాలజిస్ట్)గా సుపరిచితురాలైన ఆమె నిస్వార్థ సేవల గురించి ఉయ్యూరు ప్రాంతంలో తెలియని వారంటూ లేరు. వృత్తి లోనూ, ప్రవృత్తిలోనూ మానవత్వం మూర్తీభవించిన వ్యక్తి ఆమె. తన గురించి కాక ఇతరుల కష్టసుఖాల గురించి ఎక్కువగా ఆలోచించేది. పేదలకు విద్య, వైద్య పరంగా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టింది. కమ్యూనిస్టు కుటుంబంలో పుట్టింది కాబట్టే ఆమె ఇలా జీవించగలిగిందని నా నమ్మకం. సామాజిక స్పృహతో నిత్యం పేదలకు చేయూతనిచ్చే ఆమె క్యాన్సర్‌తో పోరాడి ఇటీవలె మరణించింది. ఆమె మరణం ఆప్తులకే కాదు పేదలందరికీ తీరని లోటు. మరణానంతరం కూడా కొంతమంది మహనీయులుగా సమాజంలో అలా మిగిలిపోతారు. అలాంటి గొప్ప వ్యక్తిత్వమున్న మనిషి ఆమె.

నాగళ్ల రాజేశ్వరమ్మ, జానకి రామయ్యల ఏకైక కుమార్తె జ్యోతి. బాల్యం నుండి అల్లారు ముద్దుగా బంధువులు, ఇరుగు పొరుగు ఆలనా పాలనలో పెరిగింది. అమ్మ ఎప్పుడూ తన దగ్గరే ఉండాలని కోరుకునేది. 'నా 12 ఏళ్ల వయసులో చదువు కోసం ఫిరంగిపురం పంపుతున్న రోజున నేను వెళ్లే వరకు నాతో ఉండమని అమ్మను అడిగాను. కానీ...నాకు మహిళా సంఘం మీటింగ్ ఉంది, నాన్నకు కూడా నువ్వే భోజనం పెట్టి వెళ్ళమని చెప్పినప్పుడు చాలా బాధపడ్డాను. నా వయసు పెరిగే కొద్దీ అమ్మ చేస్తున్న ప్రజాసేవ గురించి అర్థమయింది. బంధువులు, ఇరుగుపొరుగువారు 'భర్తను, పిల్లను పట్టించుకోకుండా మీటింగ్‌లంటూ వెళుతుంది' అంటే అస్సలు సహించేదాన్ని కాదు. మా అమ్మ ఆశయం చాలా గొప్పదని వారితో వాదించేదాన్ని' అంటూ తన తల్లి గురించి మాతో ఎప్పుడూ చెప్తుండేది. ఆ మాటలు మాలో ఎంతో స్ఫూర్తిని నింపేవి.

మహనీయుల మధ్యన...

స్వాతంత్ర్యోద్యమం ముమ్మరంగా సాగుతున్న కాలం అది. భారత కమ్యూనిస్టు పార్టీ ప్రజల్లో స్వతంత్ర భావాన్ని రగుల్కొలిపింది. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొంటూనే మరోవైపు రాజా రామ్మోహన్ రాయ్, గురజాడ, వీరేశలింగం వంటి సంఘసంస్కర్తల నాయకత్వంలో సాంఘిక దురాచారాలు, సతీసహగమనం, బాల్యవివాహాలు, వివక్ష, అసమానతలకు వ్యతిరేకంగా ఉద్యమాలలో పాల్గొనేవారు. ఆడవాళ్లు గడప దాటి బయటకు వెళ్లకూడదని ఆంక్షలు నడుస్తున్న కాలంలో కడియాల గోపాలరావు, పుచ్చలపల్లి సుందరయ్య, చండ్ర రాజేశ్వరరావు, మానికొండ సుబ్బారావు వంటి నేతలు మహిళలను చైతన్య పరిచి 1936లో కృష్ణా జిల్లా మహిళా సంఘాన్ని ఏర్పాటు చేశారు. సామాజిక ఆర్థిక సమస్యలపై పోరుబాట పట్టించిందీ సంఘం. మానికొండ సూర్యావతి, నాగళ్ల రాజేశ్వరమ్మ, వల్లభనేని సీతామహాలక్ష్మి, చండ్ర సావిత్రీదేవి, డా॥అచ్చమాంబ తదితరులు చురుకైన పాత్ర వహించారు. ఆ నాటి నుండి జరిగిన పోరాటాలే తర్వాత కాలంలో మహిళలకు అనేక హక్కులను అందించాయి. అలాంటి వారి మధ్య పెరిగి, అభ్యుదయ భావాలను అందిపుచ్చుకున్న మానవతావాది డా॥జ్యోతి. ఎమర్జెన్సీ ముగిసిన తర్వాత జరిగిన ఓ సమావేశానికి రాజేశ్వరమ్మ గారు హాజరయ్యారు. అప్పుడే నాకు ఆమెతో పరిచయం. అప్పటి నుండి ఆమెను ఆప్యాయంగా మామ్మ అని, డా॥ జ్యోతిని అక్క అని పిలిచేదాన్ని.

స్ఫూర్తి నింపాయి...

తన తల్లి జైలు, రహస్య జీవితం అనుభవించింది. ఎన్ని కష్టాలు ఎదురైనా తల్లి తాను నమ్మిన మార్క్సిజం-లెనినిజం సిద్ధాంతానికి చివరి దశ వరకు కట్టుబడి ఉండటం జ్యోతిలో స్ఫూర్తిని నింపాయి. 'ఎక్కడ ఉన్నా నా గురించి, చదువు గురించి ఆందోళన పడేది. నా చదువు విషయంలో అమ్మ ప్రత్యేక శ్రద్ధ తీసుకోనేది. విశాఖ ఆంధ్ర యూనివర్శిటీలో మెడిసిన్ చదివేటప్పుడు మా ఇంట్లో పని చేస్తున్న రాములును నాకు సాయం చేసేందుకు ఊరి నుండి పంపింది. అప్పట్లో నేను నా క్లాస్‌మేట్ జగత్‌ను ఇష్టపడ్డాను. వివాహం చేసుకుంటానని అమ్మతో, సూర్యావతి, సుబ్బారావు గార్లతో చెప్తే వారే నాన్నను ఒప్పించి 1965లో మా వివాహం ఘనంగా జరిపించారు. కానీ 1967లో డాక్టర్ జగత్ అనారోగ్యంతో మరణించారు. దాంతో చాలా కుంగిపోయాను' అంటూ అప్పుడప్పుడు మాతో చెప్పుకొని బాధపడేది.

ఆదాయంలో కొంత భాగం పేదలకే...

తర్వాత ఎనస్తీషియాలజీ చేయటానికి జ్యోతి ఇంగ్లాండ్ వెళ్లింది. అనంతరం అమెరికా, ఇంగ్లాండు, దుబాయ్, అబుదాబి మొదలైన దేశాల్లో వైద్యురాలిగా పని చేసింది. 1977లో తల్లిదండ్రుల ప్రోద్భలంతో డాక్టర్ ప్రసాద్‌ను వివాహం చేసుకుంది. ఇండియా వచ్చి హైదరాబాద్‌లో ప్రాక్టీస్ కొనసాగించింది. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను చూసుకునేందుకు సొంతూరైన కాటూరు వచ్చి అక్కడి నుండే ఉయ్యూరు, కానూరు, విజయవాడ హాస్పిటళ్లలో ఎనస్తీషియాలజిస్టుగా వైద్యాన్ని అందించేది. వైద్యురాలిగా తనకు వచ్చిన ఆదాయంలో కొంత భాగాన్ని పేద రోగుల మందులు, ఫీజులకు ఉపయోగించేది. తన చివరి దశలోనూ పేదవారు ఎవరైనా వైద్య సహాయం కోసం వస్తే డాక్టర్ దగ్గరకు పంపడమే గాక ఒక్కో సందర్భంలో వారి ఫీజులు కూడా ఆమే చెల్లించేది. తన ఇంట్లో పని చేసే వారి పిల్లల ఉన్నత చదువులకు ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకుంది.

> వృద్ధాప్యంలో తల్లిదండ్రులను చూసుకునేందుకు సొంతూరైన కాటూరు వచ్చి ... అక్కడి నుండే ఉయ్యూరు, కానూరు, విజయవాడ ఆస్పత్రులలో ఎనస్తీషియాలజిస్టుగా వైద్యాన్ని అందించేది. వైద్యురాలిగా తనకు వచ్చిన ఆదాయంలో కొంత భాగాన్ని పేద రోగుల మందులు, ఫీజులకు ఉపయోగించేది. తన చివరి దశలోనూ పేదవారు ఎవరైనా వైద్య సహాయం కోసం వస్తే డాక్టర్ దగ్గరకు పంపడమే గాక ఒక్కో సందర్భంలో వారి ఫీజులు కూడా ఆమే చెల్లించేది. తన ఇంట్లో పని చేసే వారి పిల్లల ఉన్నత చదువులకు ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకుంది.

కృష్ణా జిల్లా కాటూరు గ్రామంలో నేడు డా॥ జ్యోతి సంతాప సభ



ట్రస్ట్ ఏర్పాటు...

తల్లి అనారోగ్యంగా ఉన్న సమయంలో జ్యోతి ఆమెను కంటికి రెప్పలా కాపాడుకుంది. ఎలాంటి బెడ్‌సోర్స్ రాకుండా జాగ్రత్తపడింది. ఆ సమయంలోనే జ్యోతి క్యాన్సర్ బారిన పడింది. అయినా తన ఆరోగ్యం కన్నా తల్లి ఆరోగ్యాన్నే చూసుకుంది. అలా చివరి వరకు పేదల కోసమే పని చేసిన తల్లి రాజేశ్వరమ్మ 2016లో చనిపోయింది. ఓ డాక్టర్ అయ్యుండి కూడా తన ఆరోగ్యం గురించి పట్టించుకోకపోవడం మాకు చాలా బాధగా అనిపించేది. తన తల్లి కోసమే జీవిస్తుందా అన్నట్టుగా ఉండేది. తన తల్లిదండ్రుల ఆశయాలను కొనసాగించాలనే ఉద్దేశంతో వారి పేరుతో ఉయ్యూరులో ఓ ట్రస్టును ఏర్పాటు చేసి ఆఫీసు నిర్మాణానికి రూ.30 లక్షలు ఖర్చుపెట్టింది. గత 2 సంవత్సరాల నుండి టైలరింగ్, ఎంబ్రాయిడరీ, పెయింటింగ్, సాంస్కృతిక కార్యక్రమాల శిక్షణ, సెమినార్లు క్రమం తప్పకుండా జరుగుతున్నాయి.

తన తర్వాత కూడా...

క్యాన్సర్ వ్యాధితో చివరి దశలో వుండగా...తన అకౌంట్‌లో వున్న డబ్బుతో ఉయ్యూరులో నాగళ్ళ రాజేశ్వరమ్మ, జానకి రామయ్య విజ్ఞాన కేంద్రానికి కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయాలన్న ఆఖరి కోరికను వెల్లడించింది. దానిపైన వచ్చే వడ్డీని పేదలకు ఉచిత విద్య, వైద్యం, ఉపాధి, వృత్తి శిక్షణా కేంద్రాలు నిర్వహించాలని ఆమె కాంక్షించింది. ఉయ్యూరు ప్రాంతంలో రాజేశ్వరమ్మతో పాటు జ్యోతి చేసిన సేవా కార్యక్రమాలు కొనసాగించాలని కుటుంబ సభ్యుల కోరిక మేరకు డాక్టర్ జ్యోతి చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసి రెండు ట్రస్టులు నిర్వహించాలన్న నిర్ణయం జరిగింది.

మనుషులు పుడతారు, పోతారు. ఈ రెండిటి మధ్య జీవితాన్ని ఎలా గడిపారు, చుట్టూ ఉన్న సమాజానికి తమ వంతుగా ఏ విధంగా తోడ్పడ్డారనేదే ముఖ్యం. అలా తోటివారి మేలు కోసం కడదాకా తపించిన జ్యోతి జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం. తల్లి రాజేశ్వరమ్మ ఆశయాన్ని, ఆదర్శాన్ని తుది వరకు పాటించి, తన తర్వాత కూడా పేదలకు సేవలు కొనసాగాలని కోరుకున్న డా॥జ్యోతి గొప్ప మానవతావాది, ధన్యజీవి.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు /

నేనెందుకు చదువుతాను ?

నేనెందుకు చదువుతాను?
చదవకుండా ఉండలేను కాబట్టి–
నేర్చుకోవడానికి, ఎదగడానికి, నవ్వడానికి: స్ఫూర్తి పొందడానికి !
ఇంత వరకూ నాకు తెలియని విషయాల్ని అర్థం చేసుకోవడానికి –
అనాలోచితంగా ఆత్మీయుల్ని విసుర్తున్నప్పుడు చదువుతాను.
మదన పడడమూ, మననం చేసుకోవడమూ చదవడమే కదా?
భయంతోనూ, నిరాశా నిస్పృహలతోనూ ముక్కలై పోతున్నట్లుగా అనిపించినపుడు
శక్తి కోసం చదువుతాను–
ఈ ప్రపంచం మీద అమితమైన ఆగ్రహం కలిగినప్పుడు చదువుతాను–
అంతా సజావుగా ఉన్నప్పుడు కూడా ప్రశాంతంగా చదువుతాను–
చర్మం, ఎముకలు, చూపులు, భావాలతో మాత్రమే కాదుగదా నేను రూపొందిందీ?
అంతేకాదు, మాటలతో కదా నేను ఏర్పడ్డానూ?
నా హృదయంలో దాగి ఉన్న భావాల్ని వ్యక్తీకరించడానికి మాటలు కావాలి!
మాటలు సజీవం–నేనూ సజీవం, జీవాన్ని జీవంతో కలపడానికి చదువుతాను !
నేను ప్రేమించే కథ ఏదైనా కనిపించినపుడు
ఒకే పాట మళ్ళీ మళ్ళీ పాడుకున్నట్టు
ఒకే కథ మళ్ళీ మళ్లీ చదువుతుంటాను
ఆ పదాలతోనే నేను, కథలోకి ప్రవేశిస్తాను
ఆ పాత్రల్లో చేరి ఊపిరి పీలుస్తాను
వాటి నిర్వేదాన్ని, నిరాశల్ని నేను అనుభవిస్తాను
అవి ఏదైనా బుద్ధితక్కువ పని చేయబోతే,
కోపంగా అరుస్తాను..వాటితో పాటు
నేనూ ఏడుస్తాను.
కాసేపటికి వాటితో పాటే మళ్ళీ నవ్వుతాను.
చదవడ మంటే నాకు –ఒక మంచి స్నేహితుడితో గడిపినట్టుంటుంది !
పుస్తకం–ఒక మంచి మిత్రుడు–అయితే,
ఆ అనుభూతిని ఆ స్థాయిలో అందించేవి
చాలా ఉండవు! జాగ్రత్తగా ఎన్నిక చేసుకోవాలి!
- డా॥ దేవరాజు మహారాజు



హర్ష్ మందర్‌పై వేధింపులు ఆపండి

- విచారణలు నిలిపివేయండి : ప్రముఖుల డిమాండ్

న్యూఢిల్లీ : మానవ హక్కుల కార్యకర్త హర్ష్ మందర్‌పై వేధింపులు ఆపాలని, సిబిఐ ఎఫ్ఐఆర్ సహా ఆయన పైన, ఆయన సహచరుల పైన చేస్తున్న విచారణలను నిలిపివేయాలని వివిధ రంగాలకు చెందిన 250 మంది ప్రముఖులు డిమాండ్ చేశారు. విదేశీ విరాళాల నియంత్రణ చట్టాన్ని ఉల్లంఘించారన్న ఆరోపణపై హర్ష్ మందర్, ఆయన నడుపుతున్న పరిశోధన, న్యాయవాద సంస్థ కేంద్రం పైన సిబిఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసిన నేపథ్యంలో వారంతా సంయుక్త పత్రిక ప్రకటన విడుదల చేశారు. దీనిపై పియుసిఎల్ అధ్యక్షులు కవితా శ్రీవాత్సవ, ఆర్థికవేత్త జీన్ డ్రెజ్, రచయిత, కాలమిస్ట్ అపూర్వానంద్, భారతీయ మహిళా జాతీయ సమాఖ్య అధ్యక్షురాలు అరుణా రాయ్, మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ సహ వ్యవస్థాపకుడు నిఖిల్ దే తదితరులు సంతకాలు చేశారు. డాక్టర్ హర్ష్ మందర్‌ను నిరంతరం వేధింపులకు గురిచేయడాన్ని, భయపెట్టడాన్ని వారంతా ముక్తకంఠంతో నిరసించారు. 2020 నుండి ఎన్‌సిపిసిఆర్, ఢిల్లీ పోలీసులకు చెందిన ఆర్థిక నేరాల విభాగం, ఐటి, ఇడి.. ఇప్పుడు సిబిఐ హర్ష్ మందర్‌ను వెంటాడి వేధిస్తున్నాయని వారు తెలిపారు. ఎన్నో కేసులు పెట్టినప్పటికీ ఒక్క దానిలోనూ న్యాయస్థానంలో ఛార్జిషీటు దాఖలు చేయలేదని వివరించారు. మందర్, ఆయన సంస్థలపై జరుగుతున్న దాడిని దేశంలోని పౌర సమాజంపై సాగిస్తున్న దాడిగా చూడాలని, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు కృషి చేసే వారందరి పైన ఇలాంటి దాడులకే తెగబడుతున్నారని విమర్శించారు.

పంజాబ్ గవర్నర్ రాజీనామా

చండీగఢ్ : పంజాబ్ గవర్నర్ బన్వరీలాల్ పురోహిత్ శనివారం తన గవర్నర్ పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల వల్లే తన పదవికి రాజీనామా చేస్తున్నానని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాసిన తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. 'నాకున్న బాధ్యతల వల్ల.. వ్యక్తిగత కారణాల వల్ల నేను గవర్నర్ పదవికి రాజీనామా చేస్తున్నాను. దయచేసి నా రాజీనామాను అంగీకరించండి.' అని బన్వరీలాల్ తన లేఖలో పేర్కొన్నారు. పంజాబ్ సిఎం భగవంత్‌మాన్‌కి, కేంద్ర పాలిత ప్రాంత గవర్నర్ బన్వరీలాల్ మధ్య విభేదాలు నెలకొన్నాయి. గతేడాది నుంచి వారి మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఈ నేపథ్యంలో గవర్నర్ తన పదవికి రాజీనామా చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఇమ్రాన్ దంపతులకు ఏడేళ్ల జైలు

ఇస్లామాబాద్ : పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు మరో కేసులో ఏడేళ్ల జైలు శిక్ష పడింది. ఇమ్రాన్ చేసుకున్న మూడో పెళ్లి ఇస్లామిక్ చట్టం ప్రకారం చట్ట విరుద్ధమని పేర్కొంటూ దంపతులిద్దరికీ ఏడేళ్ల చొప్పున జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. ఇమ్రాన్‌ఖాన్‌కు గత వారం రోజుల్లో వరుసగా ఇది మూడో తీర్పు. మొదటి రెండు కేసుల్లో ప్రభుత్వ రహస్యాలు లీక్ చేసినందుకు పదేళ్లు, భార్యతో కలిసి అవినీతికి పాల్పడినందుకు 14 ఏళ్ల శిక్ష విధించారు.

లడక్‌కు రాష్ట్ర హోదా

- ఆరో షెడ్యూల్‌లో చేర్చండి
- లేహ్, కార్గిల్ జిల్లాల్లో బంద్
- వేలాదిమందితో భారీ ప్రదర్శనలు



లేహ్‌లో సభకు హాజరైన జనం

లడఖ్ : జమ్ముకాశ్మీర్‌లోని లడఖ్‌కు రాష్ట్ర హోదా కల్పించాలని, ఆరోషెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తూ లేహ్, కార్గిల్ జిల్లాల్లో శనివారం వేలాదిమంది ఆందోళనకారులు భారీ ప్రదర్శనలు నిర్వహించారు. ఆ రెండు జిల్లాల్లోనూ సంపూర్ణంగా బంద్ నిర్వహించారు. జమ్ముకాశ్మీర్‌కు ఆర్టికల్ 370ను రద్దు చేయడంతో తలెత్తిన మార్పులను వ్యతిరేకిస్తూ లేహ్ అపెక్స్ బాడీ (ఎల్ఎబి), కార్గిల్ డెమొక్రటిక్ అలయన్స్ (కెడిఎ) పిలుపు మేరకు బంద్ నిర్వహించారు. జమ్ము కాశ్మీర్ నుంచి వేరుచేసిన తర్వాత లడఖ్ ప్రజలకు ప్రత్యేక హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ సాగుతున్న ఆందోళనలకు ఈ రెండు గ్రూపులు నాయకత్వం వహిస్తున్నాయి.

చట్టసభ లేకుండా 2019లో కేంద్రపాలిత ప్రాంతంగా మారిన లడఖ్‌కు రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరించడంతోపాటు గిరిజన హోదా కల్పించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్‌లో చేర్చాలని, స్థానికులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించాలని, లేహ్, కార్గిల్ జిల్లాలకు చెరొక పార్లమెంట్ సీటు ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. శనివారం లేఖ్, కార్గిల్ జిల్లాల్లో సంపూర్ణంగా బంద్ జరిగింది. వ్యాపార కార్యకలాపాలన్నీ స్తంభించాయి.

డిమాండ్లను అంగీకరించండి : నేతల పిలుపు

లేహలోని సెంగె నామ్‌గ్యాల్ స్క్వేర్ నుంచి డిప్యూటీ కమిషనర్ కార్యాలయం వరకూ సుమారు రెండు కిలోమీటర్ల మేర భారీ మార్చ్ నిర్వహించారు. అనంతరం బహిరంగ సభలో నేతలు ప్రసంగిస్తూ, కేంద్ర ప్రభుత్వం తమ డిమాండ్లను అంగీకరించాలన్నారు. ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలన్న ప్రదర్శకుల నినాదాలు హోరెత్తాయి. మెగసెసె అవార్డు గ్రహీత సోనమ్ వాంగ్‌చుక్ ప్రసంగిస్తూ, లడఖ్‌ను ఆరవ షెడ్యూల్‌లో కలుపుతామని కేంద్ర మంత్రులు హామీలిచ్చారని, ఇంతవరకు అమలు చేయలేదని విమర్శించారు. 2019 పార్లమెంట్ ఎన్నికలు, 2020 లేహ్ హిల్ కౌన్సిల్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎవరైనా దాని గురించి మాట్లాడితే వేధిస్తున్నారన్నారు. మైనింగ్ పరిశ్రమ ద్వారా లడక్‌ను నాశనం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగ హక్కులను సాధించేవరకూ ఉద్యమాన్ని కొనసాగిస్తామని చెప్పారు. అత్యంత చలిగా వున్నా లెక్క చేయకుండా అన్ని వయసులు, గ్రూపులకు చెందిన వారు 'లేహ్ చలో' ప్రదర్శనలో పాల్గొన్నారు. 2019 తరువాత నిర్వహించిన అతి పెద్ద భారీ బహిరంగ సభగా స్థానికులు తెలిపారు.

కార్గిల్ సభలో మాజీ మంత్రి చెరింగ్ దోర్జయ్ మాట్లాడుతూ ప్రజల మనోభావాలను కేంద్రం గౌరవించాలని డిమాండ్ చేశారు. బంద్‌కు సంపూర్ణ మద్దతు లభించిందని, భారీ ఎత్తున ప్రజలు సభకు తరలివచ్చారని, ఇప్పటికైనా కేంద్రం దిగి రావాలని అన్నారు. లడఖ్ బిజెపి చీఫ్ పదవికి 2020లో రాజీనామా చేసిన దోర్జయ్ కేంద్రం తీరును తీవ్రంగా నిరసించారు.


న్యూఢిల్లీలోని సిఎం కేజ్రీవాల్ నివాసం ఎదుట భద్రతా సిబ్బంది

కేజ్రీవాల్‌పై ఢిల్లీ కోర్టుకు ఇడి

- 8న విచారణకు న్యాయస్థానం అంగీకారం
- సిఎం, మంత్రి నివాసాలకు ఢిల్లీ పోలీసులు

న్యూఢిల్లీ : ఎక్సైజ్ పాలసీ మనీలాండరింగ్ కేసులో సమన్లను ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పాటించడం లేదని పేర్కొంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ శనివారం ఢిల్లీ కోర్టును ఆశ్రయించింది. కేజ్రీవాల్‌కు ఈ కేసులో ఐదవసారి సమన్లు జారీ చేసినా శుక్రవారం విచారణకు హాజరుకాకపోవడం "చట్టవిరుద్ధం" అని పేర్కొంది. అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ దివ్య మల్హోత్రా ముందు ఇడి పిటిషన్ దాఖలు చేయగా, ఫిబ్రవరి 7న ఈ కేసును విచారించేందుకు అంగీకరించారు.

ఆప్ ప్రభుత్వమే లక్ష్యంగా ఎత్తులు

ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వాన్ని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుంది. మనీలాండరింగ్ కేసులో ఆప్ మంత్రులైన సత్యేందర్ జైన్, మనీష్ సిసోడియాను ఇప్పటికే ఇడి అరెస్టు చేసి, జైలులో ఉంచింది. ఇప్పుడు ఆ రాష్ట్ర సిఎంనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఇడి ద్వారా సమన్లు జారీ చేస్తోంది. మద్యం కుంభకోణం కేసులో పలుసార్లు కేజ్రీవాల్‌కి ఇడి సమన్లు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇడి విచారణకు హాజరయ్యేందుకు కేజ్రీవాల్ నిరాకరిస్తున్నారు. తమ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు ఆప్‌కు చెందిన ఏడుగురు ఎమ్మెల్యేలకు ఒక్కొక్కరికి రూ.25 కోట్లు చొప్పున బిజెపి ఆఫర్ చేసిందని గతవారం కేజ్రీవాల్ ఆరోపించారు. బిజెపి 'ఆపరేషన్ లోటస్ 2.0' ప్రారంభించిందని ఆ రాష్ట్ర విద్యాశాఖామంత్రి అతిషి విమర్శించారు. గతేడాది కూడా ఆప్ ఎమ్మెల్యేలను ప్రలోభ పెట్టేందుకు బిజెపి యత్నించినా, ఆ ప్రయత్నాలు విఫలమయ్యాయని అతిషి చెప్పారు. శనివారం ఉదయం ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ చెందిన పోలీసుల బృందం కేజ్రీవాల్ ఇంటికెళ్లింది. ఆప్ ఎమ్మెల్యేలను బిజెపి కొనేందుకు ప్రయత్నిస్తుందన్న కేజ్రీవాల్ ఆరోపణలపై క్రైమ్ బ్రాంచ్ బృందాలు నోటీసులివ్వడానికి ఆప్ మంత్రి అతిషి ఇంటికి కూడా వెళ్లాయి. కేజ్రీవాల్ ఇంటి అధికారులు ఈ నోటీసును స్వీకరించడానికి నిరాకరించారు. క్రైమ్ బ్రాంచ్ బృందాలు ఇంటికి వెళ్లే సమయానికి అతిషి ఇంట్లో లేరని మీడియా పేర్కొంది. ఈ నోటీసును కేజ్రీవాల్‌కు వ్యక్తిగతంగా ఇచ్చేందుకు క్రైమ్ బ్రాంచ్ భావిస్తున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

శివసేన నేతపై కాల్పులు...

- బిజెపి ఎమ్మెల్యే అరెస్ట్
- పోలీస్ స్టేషన్‌లోనే ఘటన


బిజెపి ఎమ్మెల్యే గణపత్ గైక్వాడ్, చికిత్స పొందుతున్న మహేష్ గైక్వాడ్

ముంబయి : మహారాష్ట్రలో శివసేన (షిండే) నేత మహేష్ గైక్వాడ్‌పై బిజెపి ఎమ్మెల్యే గణపత్ గైక్వాడ్ శుక్రవారం రాత్రి కాల్పులు జరిపారు. పోలీస్ స్టేషన్‌లోనే ఈ ఘటన జరగడం విశేషం. కల్యాణ్ ఈస్ట్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న గణపత్ శివసేనకు చెందిన కల్యాణ్ నగర అధ్యక్షుడు మహేష్‌పై ఈ దారుణానికి పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించి గణపత్‌తో పాటు మరో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఉల్హాస్‌నగర్‌లోని హిల్‌లేన్ పోలీస్ స్టేషన్‌లో సీనియర్ ఇన్‌స్పెక్టర్ క్యాబిన్‌లో మహేష్, మరో వ్యక్తిపై గణపత్, ఆయన అనుచరుడు కాల్పులు జరిపారని డిఎస్‌పి సుధాకర్ పథారే తెలిపారు.

గణపత్‌కు సహాయకులుగా వచ్చిన మరో ముగ్గురిపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. అరెస్టుకు ముందు గణపత్ ఓ మరాఠీ ఛానల్‌తో మాట్లాడుతూ తన కుమారుడిని పోలీస్ స్టేషన్‌లో కొడుతుంటే మహేష్‌పై కాల్పులు జరిపానని, ఇందుకు తానేమీ విచారించడం లేదని చెప్పారు. 'అవును. నేను కాల్పులు జరిపాను. ఇందుకు విచారించడం లేదు. పోలీస్ స్టేషన్‌లో పోలీసుల ముందే నా కుమారుడిని కొడుతుంటే నేనేం చేయాలి?' అని ప్రశ్నించారు. ఐదు రౌండ్ల కాల్పులు జరిపానని కూడా ఆయన అన్నారు. ఈ ఘటన వెనుక ఆత్మరక్షణ లేదా కవ్వింపు అనేవే లేవని పోలీస్ అధికారులు తెలిపారు. మొత్తం పది బులెట్లు కాల్చారని, వాటిలో ఆరింటిని మహేష్ శరీరం నుండి తొలగించారని చెప్పారు. మహేశ్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ కాల్పుల్లో శివసేన ఎమ్మెల్యే రాహుల్ పాటిల్ కూడా గాయపడ్డారు. శివసేన మద్దతుదారులు ఆసుపత్రి వద్దకు భారీ సంఖ్యలో చేరుకున్నారు. ఈ ఘటనపై శివసేన (థాకరే) తీవ్రంగా స్పందించింది. రాష్ట్రంలో ఆటవిక పాలన నడుస్తోందని విమర్శించింది.

షిండే రాజీనామా చేయాలి : ప్రతిపక్షాలు

అధికార దుర్వినియోగానికి కాల్పుల ఘటన నిదర్శనమని, కాల్పుల ఘటనకు బాధ్యత వహిస్తూ షిండే సిఎం పదవికి రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ఘటనకు సిఎం బాధ్యత వహించాలని ఎన్‌సిపి అధినేత శరద్‌పవార్ పేర్కొన్నారు. శాంతిభద్రతలు దిగజారాయని కాంగ్రెస్ విమర్శించింది. 'పోలీస్ స్టేషన్‌లోనే కాల్పులు జరిగాయి. మా పార్టీ నేతపై బిజెపి ఎమ్మెల్యే కాల్పులు జరిపారు. మహారాష్ట్ర ఓ ఆటవిక రాజ్యంగా ఎలా మారిందో ఊహించండి. ప్రజలకు మేలు చేయాల్సిన ఎమ్మెల్యే కాల్పులకు తెగబడడం దురదృష్టకరం. మన రాష్ట్రం ఏ దిశగా సాగుతోంది?' అని శివసేన (థాకరే) ప్రతినిధి ఆనంద్ దూబే ప్రశ్నించారు.

దిగొచ్చిన యుజిసి

- పోస్టుల డీ-రిజర్వేషన్‌పై డ్రాఫ్ట్ మార్గదర్శకాలపై వెనక్కి

ప్రజాశక్తి -న్యూఢిల్లీ బ్యూరో

సామాజిక, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల ఆందోళనలు, విమర్శలతో యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) దిగొచ్చింది. తాను తీసుకున్న రిజర్వేషన్ వ్యతిరేక నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది. పోస్టుల డీ-రిజర్వేషన్‌పై డ్రాఫ్ట్ మార్గదర్శకాల నుంచి తొలగించింది. 'డీ-రిజర్వేషన్' పేరుతో యుజిసి చివరి ముసాయిదా మార్గదర్శకాల్లో పదో అధ్యాయం ఎస్సీ, ఎస్టీ, ఒబిసి అభ్యర్థులకు రిజర్వు చేయబడిన పోస్టులను 'అరుదైన, అసాధారణమైన సందర్భాల్లో' డీ-రిజర్వ్ చేయవచ్చని ప్రతిపాదించింది. షెడ్యూల్డ్ కులం (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగ (ఎస్టీ), ఇతర వెనుకబడిన తరగతి (ఒబిసి) అభ్యర్థులకు కేటాయించిన సీట్లను డీ-రిజర్వ్ చేయడంపై పెద్ద దుమారం చెలరేగిన నేపథ్యంలో ఉన్నత విద్యా సంస్థల (హెచ్ఈఐ)లో కేంద్ర ప్రభుత్వ రిజర్వేషన్ విధానం అమలు మార్గదర్శకాల తుది ముసాయిదాను యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) తొలగించింది. యుజిసి, కేంద్ర ప్రభుత్వం రెండూ కేంద్ర నిధులతో పనిచేసే విశ్వవిద్యాలయాలు ఎటువంటి రిజర్వ్ చేయబడిన అధ్యాపకుల స్థానాలను డీ-రిజర్వ్ చేయవని, మార్గదర్శకాల 'ముసాయిదా' అని వివరణ జారీ చేశాయి.


హెలికాప్టర్లు అద్దెకు తీసుకుని హిమంత బిశ్వ శర్మ హాజరైన వివిధ కార్యక్రమాలు

పెళ్లిళ్లకు, ప్రచారాలకు

సర్కారు సొమ్ముతోనే విమాన విహారం

- అసోం సిఎం నిర్వాకం !

గౌహతి : బిజెపికి చెందిన అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ కోట్లాది రూపాయల ప్రభుత్వ ధనాన్ని సొంత పనుల కోసం విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారు. రాష్ట్రంలోనూ, బయట బిజెపి ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ప్రతిసారీ హెలికాప్టర్లు, ఛార్టర్డ్ విమానాలు అద్దెకు తీసుకొని విహరిస్తున్నారు. అందుకయ్యే వ్యయాన్ని ప్రభుత్వమే భరిస్తోంది. పార్టీ కార్యక్రమాలతో పాటు వివాహాలకు హాజరయ్యేందుకు కూడా ఆయన ప్రభుత్వ సొమ్మునే వాడుకుంటున్నారు. ఇది ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణ కాదు. సమాచార హక్కు చట్టం కింద అడిగిన ప్రశ్నకు అసోం ప్రభుత్వం ఇచ్చిన సమాధానం.

క్రాస్‌కరంట్ అనే స్వతంత్ర వార్తా సంస్థ 2022 ఆగస్ట్ 26న శర్మ ఖర్చులపై ఆర్‌టిఐ ద్వారా సమాధానం కోరింది. పన్ను చెల్లింపుదారుల సొమ్ముతో శర్మ హెలికాప్టర్లు, ఛార్టర్డ్ విమానాలు అద్దెకు తీసుకొని పార్టీ సమావేశాలతో పాటు అనేక వివాహాలకు హాజరయ్యారని ప్రభుత్వం ఇచ్చిన సమాధానంలో తేలింది. అధికారేతర కార్యకలాపాల కోసం ఏ ప్రభుత్వమూ ప్రజాధనాన్ని ఉపయోగించకూడదు. ఇది ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధం. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ కార్యక్రమాలకు హాజరవడం, ప్రైవేటు కార్యక్రమాలకు వెళ్లడం వంటివి అధికారేతర కార్యకలాపాల కిందికే వస్తాయి.

ప్రభుత్వ కార్యక్రమాల కోసమే సొమ్ము చెల్లించి ఛార్టర్డ్ విమానాలను అద్దెకు తీసుకున్నామని గత సెప్టెంబరులో శర్మ ప్రభుత్వం శాసనసభ సాక్షిగా తెలిపింది. శర్మ చేసిన ఖర్చులకు సంబంధించి ప్రభుత్వ ఆర్థిక పద్దులపై సమాచారం కోరుతూ ఆర్‌టీఐ కింద అడిగిన ప్రశ్నకు తొలుత రాష్ట్ర సాధారణ పరిపాలనా శాఖ స్పందించలేదు. దీనిపై క్రాస్‌కరెంట్ రాష్ట్ర సమాచార కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్ర సాధారణ పరిపాలనా శాఖలో పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారిగా పనిచేస్తున్న ప్రదీప్ శర్మ గత సంవత్సరం సెప్టెంబర్ 30న కొంత సమాచారం అందించారు. అయినప్పటికీ అది పాక్షికంగానే ఉంది.

కోడ్‌ను ఉల్లంఘించి...

ముఖ్యమంత్రి సొంత సామాజిక మాధ్యమ హ్యాండిల్స్ నుండి సేకరించిన ఫొటోల ప్రకారం ఆయన కనీసం ఐదుసార్లు ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని తేలింది. బిజెపి భాగస్వామ్య పక్షమైన యుపిపిఎల్ అభ్యర్థి తరఫున ప్రచారం కోసం 2021 అక్టోబర్ 17న బిశ్వ శర్మ హెలికాప్టర్‌ను ఉపయోగించారు. ఆ మరునాడే ఓ స్మారక సమావేశానికి హాజరయ్యేందుకు మరోసారి హెలికాప్టర్‌ను వాడారు.

ఆ మరునాడు యుపిపిఎల్‌కు మరో అభ్యర్థి తరఫున ప్రచారం చేసేందుకు హెలికాప్టర్‌లో వెళ్లారు. 2021 అక్టోబర్ 30న అసోంలోని కొన్ని శాసనసభ స్థానాలకు ఉప ఎన్నికలు జరిగాయి. ఆయా స్థానాల్లో పోటీ చేసిన బిజెపి అభ్యర్థుల తరఫున ప్రచారం చేసేందుకు ముఖ్యమంత్రి హెలికాప్టర్లలోనే విహరించారు. చివరికి ఓ అభ్యర్థి నామినేషన్ పత్రాన్ని దాఖలు చేస్తుంటే ఆ కార్యక్రమానికి హాజరయ్యేందుకు కూడా ప్రభుత్వ ఖర్చుతో ఆకాశ యానం చేశారు.

ఇతర రాష్ట్రాలకు కూడా...

రాష్ట్రంలోనే కాదు...ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి తరఫున ప్రచారం చేసేందుకు కూడా బిశ్వ శర్మ ప్రభుత్వ సొమ్మును వెచ్చించి హెలికాప్టర్‌ను అద్దెకు తీసుకున్నారు. త్రిపురలో పార్టీ అభ్యర్థి, ప్రస్తుత ముఖ్యమంత్రి మాణిక్ సాహా నామినేషన్ దాఖలు చేస్తుంటే అక్కడికీ హాజరయ్యారు. అంతేకాదు... కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసిన బిజెపి అభ్యర్థుల తరఫున ప్రచారం చేసేందుకు ప్రభుత్వ సొమ్ముతో హెలికాప్టర్లు, ఛార్టర్డ్ విమానాలు అద్దెకు తీసుకున్నారు. నాగాలాండ్‌లో ప్రచారానికి వెళ్లినప్పుడూ ఇదే తంతు.

వివాహాలకూ ఖజానా ఖర్చే

ఐదు వివాహ కార్యక్రమాలకు హాజరయ్యేందుకు కూడా బిశ్వ శర్మ సర్కారీ సొమ్ముతో హెలికాప్టర్లు అద్దెకు తీసుకొని వెళ్లడం గమనార్హం. 2022 నవంబర్ 11న నాగాలాండ్ ముఖ్యమంత్రి కుమార్తె వివాహానికి హాజరయ్యేందుకు హెలికాప్టర్ ప్రయాణానికి అయిన ఖర్చు రూ.14 లక్షలు. గత సంవత్సరం జనవరి 31న ఉత్తర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కుమార్తె వివాహానికి వెళ్లినందుకు అయిన ఖర్చు రూ.23.43 లక్షలు. వీటితో పాటు మరో మూడు వివాహాలకు కూడా ఆయన ప్రభుత్వ సొమ్మునే వినియోగించి హెలికాప్టర్‌లో ప్రయాణించారు. 2021 సెప్టెంబర్ 22 నుండి 2023 జనవరి 24 వరకూ ఆయన ఏడుసార్లు ఛార్టర్డ్ విమానాలు అద్దెకు తీసుకొని బిజెపి కార్యక్రమాలకు హాజరయ్యారు. అసలే అప్పుల ఊబిలో కూరుకుపోయిన అసోంపై ముఖ్యమంత్రి బిశ్వ శర్మ విహార ఖర్చులు పెను భారాన్ని మోపుతున్నాయి. తరుణ్ గొగోయ్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నంత వరకూ రాష్ట్ర రుణ భారం రూ.41,963 కోట్లు. గత ఎనిమిది సంవత్సరాల బిజెపి పాలనలో అది ఇబ్బడిముబ్బడిగా పెరిగి 2022-23 నాటికి అది రూ.1,26,281.4 కోట్లకు చేరింది.

రఫాలో కొనసాగుతున్న దాడులు

- 24మంది మృతి
- ఆకలితో అల్లాడుతున్న చిన్నారులు

గాజా : రఫా నగరంలోని తూర్పు భాగంలో గత రాత్రంతా జరిగిన దాడుల్లో 24మంది మరణించారు. ఆస్పత్రుల్లో సరైన వైద్య సదుపాయాలు, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో గాయపడిన వారు మరణిస్తుండటంతో, మృతుల సంఖ్య పెరుగుతోంది. గాయపడిన వారికి తగిన రీతిలో చికిత్సనందించే పరిస్థితి లేదు, దాంతో డాక్టర్లు, ఇతర సిబ్బంది కోసం ఎదురుచూస్తూ నేలపై పడి వున్న వారు అలాగే ప్రాణాలు కోల్పోతున్నారు. గాజా పశ్చిమ ప్రాంతంలో ఇస్లామిక్ యూనివర్శిటీ వున్న ప్రాంతంలో కూడా కాల్పులు మొదలైనట్లు వార్తలు వస్తున్నాయి. యుద్ధం ఆరంభంలో తీవ్రంగా ధ్వంసమైన యూనివర్శిటీ ఆవరణ తదనంతర కాలంలో నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించింది. తాజాగా ఇజ్రాయిల్ మిలటరీ అక్కడ కూడా దాడులు ప్రారంభించింది. మొత్తంగా నగరమంతా శిథిలాల గుట్టగా మారింది. ఇప్పటివరకు గాజాలో 27,238మంది మరణించగా, 66,452మంది గాయపడ్డారు.

ఈ యుద్ధం కారణంగా తల్లిదండ్రులను, అయినవారిని పోగొట్టుకున్న చిన్నారులు తమ ఆకలి తీర్చుకోవడానికి ఎక్కడ ఆహారం దొరుకుతుందా అని చూస్తూ వీధుల్లో పడి తిరగడం కనిపిస్తోంది. గాజాలో పది లక్షల మందికి పైగా నిర్వాసితులైన ప్రజలు ఆకలి బాధతో అల్లాడుతున్నారు. దీనికి తోడు అత్యంత చలి కారణంగా తల దాచుకునే గూడు లేక ఇబ్బందులు పడుతున్నారు.

అంతర్జాతీయ న్యాయస్థానం రూలింగ్ ఇచ్చి వారం రోజులవుతున్నా ఇప్పటివరకు ఇజ్రాయిల్ దాన్ని పట్టించుకోవడం లేదు. ఈ వారం రోజుల వ్యవధిలోనే వెయ్యి మందికి పైగా పాలస్తీనియన్లను చంపేశారని గాజా ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. ఖాన్ యూనిస్ నగరాన్ని ఖాళీ చేయాలంటూ ఇజ్రాయిల్ బలగాలు ఆదేశిస్తుండడంతో పెద్ద సంఖ్యలో ప్రజలు మూటాముల్లె సర్దుకుని వెళ్లిపోతున్నారు. అలా వెళుతున్నవారిపై కూడా బలగాలు కాల్పులు జరుపుతున్న వీడియో ఒకటి బయటకు వచ్చింది.

800మందికి పైగా పశ్చిమదేశాల ఉద్యోగుల లేఖ

వాషింగ్టన్ : ఇజ్రాయిల్ అనుకూల విధానాన్ని అనుసరిస్తున్నందుకు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ అమెరికా, బ్రిటన్, ఇయు దేశాల్లోని 800మందికి పైగా సివిల్ సర్వెంట్లు ఒక లేఖ విడుదల చేశారు. గాజాపై మారణకాండ సాగిస్తున్న ఇజ్రాయిల్ విషయంలో తమ ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరించడంపై వారు తీవ్రంగా విమర్శించారు. న్యూయార్క్ టైమ్స్ ఈ లేఖను ప్రచురించింది. గాజాలో ఇజ్రాయిల్ వ్యవహరిస్తున్న తీరును చూసీ చూడనట్లుగా పోతున్న పశ్చిమ దేశాల ప్రభుత్వాలు అంతర్జాతీయ చట్టాన్ని తీవ్రంగా ఉల్లంఘిస్తున్నాయని, యుద్ధ నేరాలకు పాల్పడుతున్నాయని, జాతి ప్రక్షాళనకు, మారణకాండకు అనుమతిస్తున్నాయని ఆ లేఖ విమర్శించింది. గాజాపై సాగిస్తున్న యుద్ధంలో ఇజ్రాయిల్ ఎలాంటి హద్దులను పాటించడం లేదని, ఫలితంగా వందలు, వేల సంఖ్యలో సామాన్యులు మరణిస్తున్నారని పేర్కొంది. ఉద్దేశ్యపూర్వకంగానే సాయం అందకుండా చేస్తున్నారని, దీంతో వేలాదిమంది ఆకలి బాధతో అల్లాడుతూ, మృత్యు ముంగిటకు చేరుతున్నారని ఆ లేఖ విమర్శించింది. అమెరికా నేతృత్వంలోని కూటమి దేశాల్లో ప్రజా రంగంలో వున్న ఉద్యోగులు ఇటువంటి అసమ్మతి ప్రకటన జారీ చేయడం ఇదే మొదటిసారని న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది. వీరిలో ప్రధానంగా విదేశీ మంత్రిత్వ శాఖలకు చెందినవారు ఎక్కువగా వున్నారు. కాల్పుల విరమణకు పిలుపునిస్తూ, ఇంతకుముందు అమెరికా కాంగ్రెస్ ప్రతినిధి ఇల్హాన్ ఒమర్, జర్మనీ ఎంపి సెవియం డాగ్డెలాన్‌లు తీసుకువచ్చిన పిటిషన్‌పై పలు దేశాలకు చెందిన వందలాదిమంది సంతకాలు చేశారు.



మీ కోసం

పుట్టగొడుగులు ఎక్కువ రోజులు తాజాగా ఉండాలంటే పేపరు బ్యాగులో నిల్వ చేసుకోవాలి.

జీవన సౌరభం

ఇంగిత జ్ఞానం లేని మెదడులో ప్రశ్న ఉదయించదు. మౌఢ్యం నిండిన మనసుల్లో ఆలోచన పుట్టదు.

చలికాలం



వేకువనే నిద్ర లేచేందుకు
బద్ధకించే కాలం
శరీరం నులివెచ్చని
వేడిని కోరే కాలం..

మంచు తెరలు సూర్యుడిని
కప్పివుంచే కాలం
మంచు జల్లు చలచల్లగా
కురిసి వణికించే కాలం..

పెద్దలకు పిన్నలకు
గజగజగా వణుకు కాలం
చలిమంటల దరి చేరి
వెచ్చబడే చలి కాలం..

ఉన్ని దుస్తులను ధరించు కాలం
వాహన చోదకులకు కష్టకాలం

గమ్య స్థానాలకు ఆలస్యంగా చేరు కాలం
కష్టమైనా ఇష్టంగా భరించాల్సిన కాలం

మూడు నెలల పాటు
ముచ్చటగా ఉండు కాలం
మరికొన్ని రోజుల్లో మారు కాలం
ఇదే ఇదే చలికాలం
అదే అదే శీతాకాలం..

- ఆళ్ళ నాగేశ్వరరావు,
74166 38823.

సరిచేయండి

పిల్లలూ, ఇక్కడ గజిబిజిగా ఇచ్చిన అక్షరాలను సరిచేస్తే సరైన పదం వస్తుంది. ప్రయత్నించండి

లుకమరాచి	-----	తచింట్బుచె	-----
మాతారురు	-----	యాజామాలం	-----
దితగరతిగ	-----	మేకంమ	-----
రుషాహు	-----	మీమేనషాలు	-----

నేను గీసిన బొమ్మ



పి.తజ్మీన్ ఖానమ్,
2వ తరగతి,
యర్రగొండపాలెం, ప్రకాశం జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అవరోధాలు అధిగమించి...

ఆటోలు, బస్సుల నుంచి విమానాలు, రైళ్లు, యుద్ధ విమానాలు.. ఇలా ఒకటేమిటి చిన్న వాహనాల దగ్గర నుంచి పెద్ద పెద్ద వాహనాలను నడుపుతున్న మహిళా డ్రైవర్ల గురించి ఎన్నో సార్లు విన్నాం. చదివాం. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి వారు ఎదిగిన తీరును అభినందించాం. అయితే ఆర్థిక ఇబ్బందులకు తోడు వివక్ష రాజ్యమేలుతున్న సమాజంలో వారు నిత్యం అవమానాలు, వేధింపులకు గురి అవుతూనే ఉన్నారు. అందుకు ఉదాహరణే ఈ కథనం. మహారాష్ట్ర చంద్రపూర్ జిల్లా 'తడోబా అంథేరి టైగర్ రిజర్వ్ ఫారెస్ట్'ని ఆనుకుని వున్న శ్రీఖేడ గ్రామం, దాని చుట్టుపక్కల గ్రామాల్లో ఈ పరిస్థితి కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది. అక్కడ మొత్తం 70 మంది మహిళలు రిజర్వ్ ఫారెస్ట్‌లో జీప్సీ వాహనం నడిపే శిక్షణ తీసుకుని ఏడాది గడిచిపోయింది. అయినా వారెవరూ ఇంతవరకు డ్రైవర్లుగా విధుల్లోకి వెళ్లలేదు. అడవుల్లో పూలు ఏరుకుని, కట్టెలు అమ్ముకుని, వ్యవసాయ కూలీ చేసుకునే మహిళలే వారంతా. జీవితాలు బాగు చేసుకుందామని ఎంతో శ్రమ పడి డ్రైవింగ్ నేర్చుకున్నారు. కానీ ఇప్పుడు వారికి ఎదురైన పరిస్థితి భిన్న రంగాల్లో ఎంతోమంది మహిళలు పడుతున్న వెతలకు సజీవరూపం.


శ్రీఖేడ గ్రామానికి చెందిన 24 ఏళ్ల మయూరి కుల్సంగి జీప్సీ డ్రైవింగ్ శిక్షణ తీసుకుంది. శిక్షణ తీసుకున్న మొత్తం మహిళల్లో మయూరిదే మొదటి అడుగు. 2020లో తండ్రి మరణంతో ఇంటి బాధ్యత ఆమెపై పడింది. తల్లి టీ కొట్టు నడుపుకుని జీవనం సాగిస్తుంటే ఆమెకు సాయంగా వెళ్లేది. 2023లో రిజర్వ్ ఫారెస్టు చేసిన ప్రకటనతో డ్రైవింగ్ వైపు మళ్లింది. 'శిక్షణకు వచ్చిన మొత్తం పురుషుల్లో నేను ఒక్కదాన్నే మహిళను. అప్పుడు వారంతా నావైపు ఆశ్చర్యంగా చూశారు. వారితో సమానంగా శిక్షణ తీసుకుంటుంటే వాళ్లల్లో వాళ్లే మాట్లాడుకుంటూ నవ్వుకునేవారు. 'నీకు ఇవన్నీ అవసరమా? మీ అమ్మతో కలసి టీ అమ్ముకో!' అన్న వారు కూడా ఉన్నారు. ఆ మాటలు పట్టించుకోకుండా శిక్షణ తీసుకున్నాను. అడవిలోకి ఒక రైడ్ చేస్తే రూ.2700 వస్తాయి. అలాంటివి రోజుకు రెండు చేస్తాం. అయితే పరిమితిని బట్టి, అధికారులు ఇచ్చిన అనుమతిని బట్టి మా ఆదాయం నెలకు రూ.70 వేలు వస్తుంది. ఈ సొమ్ము నా కుటుంబాన్ని గట్టెక్కిస్తుందని ఎంతో ఆశపడ్డాను. కానీ పరిస్థితి వేరేలా ఉంది' అంటోంది. మయూరిని చూసి ఆ గ్రామం నుంచే రేష్మా ఐక్, లక్ష్మి కొడపె కూడా మయూరితో పాటు శిక్షణ తీసుకున్నారు.

శ్రీఖేడకి 20 కిలోమీటర్ల దూరంలోని కోలారా గ్రామం నుండి 30 ఏళ్ల భారతి కూడా శిక్షణ తీసుకుంది. పత్తి చేలో కూలీ పనులకు వెళ్లే భారతి స్టీరింగ్ పట్టుకుని ఎన్నో కలలు కన్నది. తన జీవితం మెరుగుపడుతోందని ఆశపడింది. 'ఈ అడవిలోనే నా బాల్యం గడిచింది. ఇక్కడే ఆడుకున్నాను. గెంతులు వేశాను. ఇక్కడికి వచ్చే పక్షులతో చెలిమి చేశాను. అందుకే రిజర్వ్ ఫారెస్ట్‌లోకి డ్రైవింగ్ శిక్షణ ఇస్తున్నారని తెలిసి, వెళ్లాను. మొన్న డిసెంబరులో లైసెన్సు కూడా తీసుకున్నాను. కానీ సొంత వాహనం లేకపోవడం వల్ల ఇంతవరకు సఫారీ రైడ్‌కి వెళ్లలేదు' అని నిరుత్సాహంతో చెబుతోంది.

'శిక్షణ తీసుకున్న మహిళల అందరి పరిస్థితి ఇదే. రూ.7 లక్షలు ఖర్చు పెట్టి జీప్సీని కొనుగోలు చేయలేం. బ్యాంకు రుణం తీసుకుని వాహనం కొందామన్న కుటుంబాలు ఒప్పుకోవడం లేదు. అంత సొమ్ము ఉంటే పెళ్లి చేసి పంపేవాళ్లం. లోను తీసుకుని బండి నడపడం మొదలుపెడితే, రేపు పెళ్లయిన తరువాత అత్తింటి వాళ్లు ఒప్పుకుంటారా?' అని వెనక్కి లాగుతున్నారు' అంటోంది భారతి.

'అమ్మానాన్న పూర్తి మద్దతుతో 23 ఏళ్ల రేష్మ డ్రైవింగ్ శిక్షణ తీసుకుంది. అయితే జీప్సీ కొనే స్తోమత లేక, అంత రుణం తెచ్చి బండి కొనడం వృథా అని తల్లిదండ్రులు అడ్డు చెబుతున్నార'ని తన స్నేహితురాలి గురించి కూడా భారతి చెప్పింది.





రిజర్వ్ ఫారెస్ట్‌లోకి 22 గేట్ల ద్వారా అనుమతి ఉంది. 362 జీప్సీలకు లైసెన్సులు ఇచ్చారు. అయితే జీప్సీలన్నీ పురుషులే ఎక్కువగా నడుపుతారు. ఇప్పుడు శిక్షణ తీసుకున్న మహిళలకు వాహనాలు ఉంటే వారు కూడా నడుపుకోవచ్చు. లేదా అద్దెకు తీసుకునైనా నడపవచ్చు. కానీ మహిళలకు కాదు కదా, వారు నడిపే జీప్సీలకు స్థలం ఇవ్వడానికి కూడా అక్కడి పురుషులు అంగీకరించడం లేదు. అనారోగ్యం వల్ల జీప్సీ నడపలేని పరిస్థితుల్లో కూడా వాహనాన్ని పురుషులకు ఇచ్చేందుకే మొగ్గుచూపుతున్నారు. 'జీప్సీ ఖాళీగా ఉందని తెలిసి, ఒకసారి రైడ్‌కి ఇవ్వమని ఆ డ్రైవర్లను ఎన్నోసార్లు అడిగాను. వారు ఇవ్వలేదు. పైగా లోపల అంతా గతుకుల రోడ్డు.. బండి ఎగిరెగిరి పడుతుంది. టైర్లు పంచరై గాల్లోకి తేలతాయి. మేమైతే ఏవో తంటాలు పడి మరమ్మతు చేసుకుంటాం. ఎంత రాత్రైనా ఇంటికి చేరుకుంటాం. మీ పరిస్థితి అలా కాదు కదా! మీకు అలాంటివి ఎదురైతే ఎలా బయటికి వస్తారు' అంటూ భయపెడుతున్నారు. ఆ మాటలు వింటుంటే ఫారెస్ట్‌లోకి వెళ్లాలంటే వణుకుపుడుతోంది' అంటోంది అమాయకంగా మయూరి.

గణాంకాల ప్రకారం 2020లో దేశంలో జారీచేయబడిన కోటీ ఐదు లక్షల డ్రైవింగ్ లైసెన్సుల్లో కేవలం 14.9 శాతమే మహిళలు పొందారు. సమాజంలో లోతుగా పాతుకుపోయిన లింగవివక్షను ఈ నిష్పత్తి ప్రతిబింబిస్తోంది. మహారాష్ట్రతో పాటు ఉత్తరాఖండ్ లాంటి రాష్ట్రాల్లో సఫారీ డ్రైవింగ్‌లో మహిళలు శిక్షణ పొందుతున్నారు. వందలాది మంది శిక్షణ తీసుకుంటే కొంతమందే విధుల్లో ఉంటున్నారు. ఆర్థిక లేమి, అనవసర భయాలు, వెక్కిరింపు మాటలు, వివక్ష నిండిన సమాజం ఈ మహిళలను వెనక్కి లాగుతున్నాయి. ఈ అవరోధాలన్నీ అధిగమించి ఆమె సాఫీగా ప్రయాణించాలంటే మరింత ప్రోత్సాహం కావాలి.



హనుమాన్‌కు అరుదైన రికార్డు



సంక్రాంతి పండుగకు విడుదలైన హనుమాన్ సినిమా వసూళ్లలో అరుదైన ఘనతను సాధించింది. సంక్రాంతికి విడుదలైన సినిమాల్లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల్లో మొదటిస్థానంలో నిలిచింది. సోషల్ మీడియాలో ఈ విషయాన్ని తెలియజేస్తూ టీమ్ ఆనందాన్ని వ్యక్తం చేసింది. 'ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకుల ప్రేమతో హనుమాన్ చరిత్ర సృష్టించింది. 92 ఏళ్ల టాలీవుడ్ ప్రస్థానంలో ఆల్‌టైమ్ సంక్రాంతి బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది' అని పేర్కొంది. జనవరి 12న విడుదలైన ఈ సినిమా ఇప్పటివరకు రూ.278 కోట్లకుపైగా వసూళ్లను రాబట్టింది. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'జై హనుమాన్' రానుంది. రాముడు పాత్రలో మహేష్‌బాబు, మరో ప్రధాన పాత్రలో బాలీవుడ్ స్టార్ లేదా చిరంజీవిని ఎంపిక చేసే అవకాశం ఉందని దర్శకుడు ప్రశాంత్‌వర్మ ఇటీవల చెప్పారు. ఈ సినిమాలో కూడా తేజ ఉంటారని తెలిపారు.

నేను బతికే ఉన్నా : పూనమ్

బాలీవుడ్ నటి పూనమ్ పాండే మరణించారన్న వార్తను ఆమె టీం సభ్యులు సోషల్ మీడియాలో పెట్టి శుక్రవారం వైరల్ చేశారు. ఇది నిజమా? కాదా? అని అభిమానులు అయోమయంలో పడిన తరుణంలో శనివారం ఆమె నుంచి ఒక షాకింగ్ మెసేజ్ వచ్చింది. తాను బతికే ఉన్నానంటూ తన ఎక్స్ పేజీలో పూనమ్ పోస్టు చేశారు. తనకు ఎలాంటి క్యాన్సర్ లేదని కూడా పేర్కొన్నారు. సర్వైకల్ (గర్భాశయ ముఖ ద్వార) గురించి అవగాహన కల్పించటం కోసమే అలా చేశానంటూ ఆమె సోషల్ మీడియాలో విడుదల చేసిన వీడియో ద్వారా వెల్లడించారు. ఇలా చేయడం పట్ల పలువురు నెటిజన్లు ఆమెను విమర్శిస్తున్నారు. గతంలోనూ ఆమె ఇలాంటి సంచలన ప్రకటనలు చేసి, వార్తల్లోకెక్కారు.



నేడు తిరుపతిలో అంతర్జాతీయ చలన చిత్రోత్సవం



తిరుపతిలోని మహతి ఆడిటోరియం (బాలాజీ కాలనీ)లో ఆదివారంనాడు అంతర్జాతీయ చలన చిత్రోత్సవం జరగనుంది. నెట్‌ఫ్లిక్స్ ఇండియాతో కలిసి యుఎన్ఎఫ్ఐఎన్ (యునైటెడ్ ఫిల్మ్ ఇన్వెస్టర్ నెట్‌వర్క్)తోపాటు ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఎంట్రీలను ఈనెల ఒకటోతేదీ వరకూ స్వీకరించిన ప్రతినిధులు ఆదివారం జరిగే వేడుకల్లో స్క్రీనింగ్ చేయనున్నారు. ఫీచర్ ఫిల్మ్‌లు, షార్ట్ ఫిల్మ్‌లు, మ్యూజిక్ వీడియోలు, వెబ్ సిరీస్‌లను ఇప్పటికే ఆహ్వానించారు. జాతీయ, అంతర్జాతీయ సినిమాలు కూడా ప్రదర్శించటంతోపాటు ప్రసారం చేస్తారు. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకూ ఫిల్మ్‌ల స్క్రీనింగ్, 5 నుంచి 6 గంటల వరకూ ఫిల్మ్ డిస్ట్రిబ్యూషన్ వర్క్‌షాపు, 6 నుంచి 10 గంటల వరకూ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవం ఉంటుందని నిర్వాహకులు ప్రకటించారు. తిరుపతి ఫిలిం ఫెస్టివల్ కమిటీ సినిమాను షార్ట్‌లిస్ట్ చేసింది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సినీ ప్రముఖులు, ఆర్టిస్టులు ఈ వేడుకలో పాల్గొనబోతున్నారు.

వేసవికి 'లవ్ గురు'



హీరోగా విజయ్ ఆంటోనీ, హీరోయిన్‌గా మృణాళిని రవి కలిసి నటిస్తున్న చిత్రం 'లవ్‌గురు'. విజయ్ ఆంటోనీ ఫిలిం కార్పొరేషన్ ద్వారా ఈ సినిమా నిర్మిస్తున్నారు. వినాయక్ వైద్యనాథన్ దర్శకత్వం వహిస్తున్నారు. భార్యాభర్తల మధ్య రోజువారీ జీవితంలో జరిగే సంఘటనల ఇతివృత్తంగా ఈ సినిమా ఉంటుందని ప్రకటించారు. వచ్చే వేసవిలో ఈ సినిమా విడుదల చేయనున్నట్టు చిత్ర ప్రతినిధులు తెలిపారు.

యాత్ర-2 ట్రైలర్ విడుదల



యాత్ర-2 సినిమా ట్రైలర్‌ను శనివారం నాడు చిత్ర ప్రతినిధులు విడుదల చేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాత్రలో మలయాళ హీరో మమ్ముట్టి, వైఎస్ జగన్మోహనరెడ్డి పాత్రలో జీవా నటించారు. మహి వి రాఘవ్ దర్శకత్వంలో త్రీ ఆటమ్ లీవ్స్, వీ సెల్యూలాయిడ్, శివ మేక సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సంతోష్ నారాయణన్ సంగీతాన్ని అందించారు. ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. త్వరలోనే ఈ సినిమాను విడుదల చేయబోతున్నామని పేర్కొంది.

నాగమ్మగా మంచు లక్ష్మి



నటి మంచు లక్ష్మి ప్రధాన పాత్రలో నిర్మిస్తున్న తాజా చిత్రం ఆదిపర్వం. సంజీవ్ మేగోటి దర్శకత్వంలో నాగలాపురం నాగమ్మ పాత్రలో ఆమె నటిస్తున్నారు. 1974 నుంచి 1992 మధ్య జరిగే ఒక పీరియడ్ డ్రామాగా ఈ సినిమాను తీస్తున్నామని దర్శకుడు సంజీవ్ ప్రకటించారు. గ్రాఫిక్స్ వర్క్ ఈ సినిమాలో చాలా హైలైట్‌గా నిలుస్తుందని చిత్రనిర్మాతలు పేర్కొంటున్నారు. అమ్మోరు, అరుంధతి చిత్రాల మాదిరిగా హైటెన్షన్ యాక్షన్ ఫిలింగా దక్షిణాది అన్ని భాషలతోపాటుగా హిందీలోనే ఈ సినిమాను విడుదల చేయబో తున్నామని ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూషన్ ఘంటా శ్రీనివాస్ ప్రకటించారు. ఇంకా ఆదిత్య ఓం, ఎస్తర్ నొరోన్హా, శ్రీజిత ఘోష్, మరికొంతమంది నటీనటులు పాత్రలు పోషించారన్నారు. ఇందులో మంచు లక్ష్మి ఎంతో రిస్క్‌చేసి రెండు అద్భుతమైన పోరాట సన్నివేశాలు చేశారని చెప్పారు.

ఇంగ్లండ్‌ను కూల్చిన బుమ్రా

- ఆరు వికెట్లతో సత్తాచాటిన పేసర్
- టీమిండియాకు 143పరుగుల ఆధిక్యత



బుమ్రా 15.5-5-45-6

విశాఖపట్నం: రెండోటెస్ట్‌లోనూ టీమిండియాకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. పేసర్ జస్ప్రీత్ బుమ్రా దెబ్బకు ఇంగ్లండ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 253 పరుగులకే కుప్పకూలింది. దీంతో టీమిండియా 143 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం, నేడు రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియా... రెండో రోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 28పరుగులు చేసింది. క్రీజులో ఓపెనర్లు యశస్వి జైస్వాల్ 15, కెప్టెన్ రోహిత్ శర్మ 13 పరుగులతో ఉన్నారు. టీమిండియాకు ఇప్పటికే 171 పరుగుల ఆధిక్యత లభించింది. శనివారం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ జస్ప్రీత్ బుమ్రా దెబ్బకు కకావికలమైంది. జో రూట్(5), ఓల్లీ పోప్(23), బెయిర్ స్టో(25), కెప్టెన్ బెన్ స్టోక్స్(47), టామ్ హార్ట్ లీ(21), జేమ్స్ ఆండర్సన్(6) వికెట్లు బుమ్రా ఖాతాలోకి చేరాయి. ముఖ్యంగా, తొలి టెస్టు సెంచరీ హీరో ఓల్లీ పోప్‌ను బుమ్రా అవుట్ చేసిన యార్కర్ అద్భుతం. ఆ బంతి ఓల్లీ పోప్ మిడిల్, లెగ్ స్టంప్‌లను గిరాటేసింది. ఇక, చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ కూడా మూడు వికెట్లతో సత్తా చాటాడు. కీలక సమయాల్లో వికెట్లు తీసి ఇంగ్లండ్ పతనంలో తన వంతు పాత్ర పోషించాడు. అక్షర్ పటేల్‌కు ఒక వికెట్ దక్కింది. ఓవర్‌నైట్ స్కోర్ 6వికెట్ల నష్టానికి 336పరుగులతో శనివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన టీమిండియా 396పరుగులకు పరిమితమైంది. యువకెరటం యశస్వి జైస్వాల్(209) డబుల్ సెంచరీతో కదం తొక్కాడు. ఇంగ్లండ్ బౌలర్లు ఆండర్సన్, షోయబ్ బషీర్, రెహాన్ అహ్మద్‌కు మూడేసి వికెట్లు దక్కాయి.

స్కోర్‌బోర్డు...

ఇండియా తొలి ఇన్నింగ్స్: 396పరుగులు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలే (సి)శ్రేయస్ (బి)అక్షర్ 76, డకెట్ (సి)రజత్ పటీధర్ (బి)కుల్దీప్ 21, పోప్ (బి)బుమ్రా 23, రూట్ (సి)శుభ్‌మన్ (బి)బుమ్రా 5, బెయిర్‌స్టో (సి)శుభ్‌మన్ (బి)బుమ్రా 25, స్టోక్స్ (బి)బుమ్రా 47, ఫోక్స్ (బి)కుల్దీప్ 6, రెహాన్ అహ్మద్ (సి)శుభ్‌మన్ (బి)కుల్దీప్ 6, హార్ట్‌లీ (సి)శుభ్‌మన్ (బి)బుమ్రా 21, ఆండర్సన్ (ఎల్‌బి)బుమ్రా 6, షోయబ్ బషీర్ (నాటౌట్) 8, అదనం 9.(55.5ఓవర్లలో ఆలౌట్) 253పరుగులు. **వికెట్ల పతనం:** 1/59, 2/114, 3/123, 4/136, 5/159, 6/172, 7/182, 8/229, 9/234, 10/253 **బౌలింగ్:** బుమ్రా 15.5-5-45-6, ముఖేశ్ 7-1-44-0, కుల్దీప్ 17-1-71-3, అశ్విన్ 12-0-61-0, అక్షర్ 4-0-24-1.

ఇండియా రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (బ్యాటింగ్) 15, రోహిత్ (బ్యాటింగ్) 13, (5ఓవర్లలో) 28పరుగులు. **బౌలింగ్:** ఆండర్సన్ 2-0-6-0, షోయబ్ బషీర్ 2-0-17-0, రెహాన్ అహ్మద్ 1-0-5-0.



జైస్వాల్ డబుల్ సెంచరీ

టీమిండియా యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్(209) కెరీర్ అత్యధిక స్కోర్(డబుల్ సెంచరీ)తో కదం తొక్కాడు. 6వ టెస్ట్ ఆడుతున్న యశస్వి 179 పరుగులతో రెండో రోజు ఆటను కొనసాగించి వ్యక్తిగత స్కోర్ 191 పరుగుల వద్ద షోయబ్ బషీర్ బౌలింగ్‌లో సిక్సర్, ఆ మరుసటి బంతికే స్క్వేర్ లెగ్‌లో బౌండరీ కొట్టి డబుల్ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. ఈ క్రమంలో జైస్వాల్ టెస్టుల్లో డబుల్ సెంచరీ కొట్టిన భారత నాలుగో ఎడమచేతి వాటం బ్యాటర్‌గా రికార్డు పుటల్లోకెక్కాడు. అతడి కంటే ముందు సౌరభ్ గంగూలీ(239), వినోద్ కాంబ్లీ(227), గౌతం గంభీర్(206)లు ఈ ఫీట్ సాధించారు.

మూడో అతి పిన్న వయస్కుడిగా...

డబుల్ సెంచరీ బాదిన మూడో అతి పిన్న వయస్కుడిగా జైశ్వాల్ రికార్డులకెక్కాడు. జైశ్వాల్ 22ఏళ్ల 37రోజుల వయస్సులో ఈ ఘనతను అందుకున్నాడు. ఈ జాబితాలో భారత మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీ(21ఏళ్ల 35రోజులు) తొలి స్థానంలో ఉండగా.. ఆ తర్వాతి స్థానంలో సునీల్ గవాస్కర్(21ఏళ్ల 283రోజులు) జైస్వాల్‌కంటే ముందున్నారు.

భారత్ సెమీస్ ప్రత్యర్థి దక్షిణాఫ్రికా

ఐసిసి అండర్-19 వన్డే ప్రపంచకప్

జొహన్నెస్‌బర్గ్: ఐసిసి (అండర్-19) వన్డే ప్రపంచకప్ సెమీస్‌లో భారత యువజట్టు ప్రత్యర్థి ఎవరో తేలిపోయింది. శనివారం జరిగిన చివరి సూపర్-6 మ్యాచ్‌లో పాకిస్తాన్ జట్టు 5పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌ను చిత్తుచేయడంతో భారతజట్టు ప్రత్యర్థి ఆతిథ్య దక్షిణాఫ్రికా జట్టుతో తలపడనుంది.

ఊపిరి పీల్చుకున్న పాకిస్తాన్...

పాకిస్తాన్ యువజట్టు ఐదు పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించి ఊపిరి పీల్చుకుంది. సెమీస్‌కు చేరాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో పాకిస్తాన్ జట్టు 5పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించింది. చివర్లో 19 బంతుల్లో 10 పరుగులు చేస్తే బంగ్లాకు ఛాన్స్ అనుకున్నదశలో 5పరుగుల వద్ద చివరి వికెట్‌ను కూల్చింది. తొలుత పాకిస్తాన్ జట్టు 40.4ఓవర్లలో 155పరుగులకే ఆలౌటైంది. మిన్హాస్(34), సహజిద్(26) టాప్ స్కోరర్స్. బంగ్లా బౌలర్లలో బోర్జన్, జిబన్‌కు నాలుగేసి వికెట్లు దక్కాయి. 156పరుగుల ఛేదనలో బంగ్లా 127పరుగులకు 9వికెట్లు కోల్పోయి ఓటమి కోరల్లో నిలిచింది. ఆ దశలో చివరి వికెట్‌కు బర్సన్(21నాటౌట్), మ్రిధా(4) అద్భుతంగా ఆడినా విజయానికి ఐదు పరుగుల వద్ద వికెట్ సమర్పించుకొని పరాజయాన్ని చవిచూశారు. పాకిస్తాన్ బౌలర్లు ఉబాద్ షాకు ఐదు, అలీ రాజాకు మూడు వికెట్లు దక్కాయి. ఇతర పోటీల్లో ఇంగ్లండ్ జట్టు 146పరుగుల తేడాతో జింబాబ్వేను చిత్తుచేయగా.. ఐర్లాండ్-బంగ్లాదేశ్ జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్ వర్షంతో రద్దయింది.

సెమీఫైనల్స్...

6(మంగళ): ఇండియా(అండర్-19) × దక్షిణాఫ్రికా(అండర్-19)
8(గురు) : ఆస్ట్రేలియా(అండర్-19) × పాకిస్తాన్(అండర్-19)

అస్మిత ఓటమి

బ్యాంకాక్: థాయ్‌లాండ్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. మహిళల సింగిల్స్‌లో సెమీస్‌కు చేరిన ఏకైక షట్లర్ అస్మిత ఛాలిహా ఓటమిపాలైంది. శనివారం జరిగిన సెమీఫైనల్లో అస్మిత ఛాలిహ 13-21, 12-21తో 4వ సీడ్ సుపనింద కెటెథాంగ్(థాయ్‌లాండ్) చేతిలో వరుససెట్లలో ఓడింది. ఈ మ్యాచ్‌ను కేవలం 35 నిమిషాల్లోనే అస్మిత చేజార్చుకుంది. దీంతో ఈ టోర్నమెంట్‌లో భారత షట్లర్ల పోరాటం ముగిసినట్లయ్యింది.

ఆంధ్ర 313/5

పాట్నా: బీహార్‌తో జరుగుతున్న రంజీట్రోఫీ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. బీహార్‌ను తొలి ఇన్నింగ్స్‌లో 182పరుగులకే పరిమితం చేసిన ఆంధ్ర.. శనివారం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించి రెండోరోజు ఆట ముగిసే సమయానికి 5వికెట్ల నష్టానికి 313పరుగులు చేసింది. ఆంధ్ర జట్టులో కెప్టెన్ రికీ బుయ్(58), రషీద్(76నాటౌట్) అర్ధసెంచరీలతో ఆదుకున్నారు. వీరిద్దరికి తోడు గిరినాత్(41), కిరణ్ షిండే(33) కూడా బ్యాటింగ్‌లో మెరిసారు. రెండోరోజు ఆట నిలిచే సమయానికి రషీద్‌కి తోడు నితీశ్ కుమార్‌రెడ్డి(39) క్రీజ్‌లో ఉన్నారు. దీంతో ఆంధ్ర జట్టుకు ఇప్పటికే 131పరుగుల ఆధిక్యత లభించింది. బీహార్ బౌలర్లు రాఘవేంద్ర, అశుతోష్‌కు రెండేసి, సాకిబుల్ ఘనికి ఒక వికెట్ దక్కాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68